ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 11 అక్టోబరు 2025



ఎన్టీఆర్‌కు ఎవరూ సరిరాలేరు

- విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే చింతమనేని
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రజలకు అభివాదం చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్, ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భవిష్యత్తులో కూడా ఎవరూ సరిరాలేరని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని క్రాప గ్రామంలో తలశిల పవన్ చేపట్టిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చింతమనేని పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ 30 ఏళ్లలో చేయలేని ఎన్నో మంచి పనులతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు ఎన్టీఆర్ అందించారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాలను ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీ పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆ మహనీయుడు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని చెప్పారు. టీడీపీ స్థాపనతో రాజకీయంగా ఎదిగామని, తమకు లాగా ఎందరికో పార్టీలో చోటు దక్కిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో చంద్రబాబు నాయుడు, లోకేశ్ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీ శాశ్వతమని, అధికారంలో ఉన్నా లేకపోయినా నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లే వైసీపీ నాయకుల ప్రయత్నాలను టీడీపీ శ్రేణులు, ప్రజలు గుర్తించాలన్నారు.

భారీ ర్యాలీతో సందడి..

గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. చింతమనేని, ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లకు నాయకులు, కార్యకర్తలు క్రాప అడ్డరోడ్డు నుంచి కనకతప్పెట్లు, డీజే సౌండ్లు, బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికారు. నేతలను భారీ గజమాలలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా విగ్రహం వరకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పరిశీలకుడు వంగా సాంబిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, తూనుగుంట్ల సాయిబాబా, కొల్లూరు నాగశ్రీధర్, తమ్మా శివారెడ్డి, తుమాటి శ్యాంబాబు, కొత్తపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె-గంగడిపాలెం

డబుల్ రోడ్డుకి రూ.49 కోట్లు

- తీరంలో రహదారుల అభివృద్ధికి నిధులు: మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో పట్టించుకోకుండా పాడుపెట్టిన రోడ్ల అభివృద్ధికి తాము నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రేపల్లె వయా తుమ్మల, గంగడిపాలెం వరకు రోడ్డును డబుల్‌లైన్‌గా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ కింద రూ.49 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా డబుల్ లైన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వందేళ్లకుపైగా రోడ్డు సౌకర్యం లేని బండికాయలమోతు గ్రామ ప్రజల ఇబ్బందులను గమనించి రోడ్డు నిర్మాణానికి ఏఐబీ గ్రాంటు నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేయించినట్లు మంత్రి తెలిపారు. పోటుమెరకగౌడపాలేనికి డీఎంఎఫ్ ద్వారా రూ.కోటి మంజూరు చేయించామన్నారు. గుంతల రోడ్లతో నియోజకవర్గ ప్రజల ఇబ్బందుల గురించి వివరించగానే నిధులు మంజూరు చేసినందుకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి అనగాని కృతజ్ఞతలు తెలిపారు.

- అవినీతికి చెక్ పెట్టేలా ఈ-కేవైసీ
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట
- శ్రామికులకు రెండు సార్లు ముఖ హాజరు
- నవంబరు నుంచి నూతన విధానం అమలు

ఉపాధికి ఇక పక్కా హామీ

ఉపాధి హామీ పనుల్లో మస్టర్ల మాయాజాలం సర్వసాధారణమైపోయింది. హాజరు విధానంలో ఉన్న లొసుగులకు తోడు కొంతమంది ఉద్యోగుల అండదండలతో నిధులను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ నివేదికల్లో పలుమార్లు అవినీతి బాగోతాలు బట్టబయలైనప్పటికీ మస్టర్ల కనికట్టు మాత్రం ఆగడం లేదు. ఉపాధి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకట్ట పడాలనే కృతనిశ్చయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. దానిలో భాగంగానే పనులకు హాజరయ్యే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేపట్టి ముఖ హాజరును తప్పనిసరి చేయనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను గడచిన నెలలోనే ప్రభుత్వం విడుదల చేసింది. శ్రామికుల జాబ్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేయడంతో పాటు, ఈ-కేవైసీ ప్రక్రియను కూడా ముమ్మరం చేసింది.



కర్లపాలెం మండలంలో జరుగుతున్న ఈ-కేవైసీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి(ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్న శ్రామికులందరినీ ఈ కేవైసీ గొడుగు కిందకు తేవడం కోసం ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించింది. నవంబరు మొదటి వారం నుంచి శ్రామికుల ముఖ హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేసి ఉపాధి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బాపట్ల జిల్లాలో మొత్తం 4,85,408 శ్రామికులు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేవైసీని 1,61,399 మంది శ్రామికులు పూర్తి చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 2,14,450 మంది ఉపాధి హామీ శ్రామికులు ఉండగా 66,561 మంది ఈ కేవైసీ గొడుగు కిందకు చేరారు. అదే విధంగా పల్నాడు జిల్లాలో అత్యధికంగా 6,04,740 మంది శ్రామికులు ఉండగా, ఇందులో 1,66,763 మంది ఈ కేవైసీ పూర్తయింది. శాతాల వారీగా పరిశీలిస్తే బాపట్ల జిల్లాలో 33.53, గుంటూరు జిల్లాలో 31.72, పల్నాడు జిల్లాలో 28.12 శాతం ఈ కేవైసీ మాత్రమే ఇప్పటి వరకు పూర్తయింది. ప్రభుత్వం ఇచ్చిన గడువుకు ఇంకా మూడు వారాలే మిగిలి ఉండడంతో (మిగతా 6లో)

బాధ్యతల నుంచి తప్పించుకోలేరు

ఇకపై దొంగ మస్టర్ల విషయంలో సంబంధిత సిబ్బంది తమ బాధ్యతల నుంచి తప్పించుకోలేని విధంగా యాప్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజైన్ చేశాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాల్లో తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా పరిశీలించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలకు వెనకాడవద్దనే ఆదేశాలను కూడా కేంద్రం స్పష్టంగా ఇచ్చింది. సోషల్ ఆడిట్‌లో భాగంగా గతంలో ఏవైనా అక్రమాలు వెలుగుచూస్తే సంబంధిత విభాగాలన్నీ కూడా ఒకదానిపై ఒకటి నెపం వేసుకుని కాలం గడిపేవి. కానీ, నూతన ఆదేశాల ప్రకారం అక్రమాలకు ఆయా విభాగాల సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

భారీ వర్షం.. విద్యుత్‌కు అంతరాయం

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీవర్షం కురిసింది. వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో ముందుజాగ్రత్తగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కర్లపాలెం రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి చీలురోడ్డు సెంటర్ వరకు గంటలకొద్దీ విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఒకవైపు వర్షం, మరోవైపు అంధకారంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వర్షం వచ్చిన ప్రతిసారి విద్యుత్ కష్టాలు తప్పడం లేదని పలువురు వాపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్

- జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ శాఖలపై సమీక్షలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్లను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలి


బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా బాపట్లను తీర్చిదిద్దాలని దిశ కమిటీ చైర్మన్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పథకాల అమలు తీరుపై దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో 21 ప్రభుత్వ శాఖల పురోగతిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పురోభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పేదరిక నిర్మూలన, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మాతృ, శిశు మరణాలు, నిరక్షరాస్యత తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధి చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లాలోని లక్షమందికి ఉపాధి కల్పించటమే లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా నుంచి తొలుత మొదలైన పీ-4పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. పక్కాగృహాల లేఅవుట్లలో రూ.94.26 కోట్లతో రోడ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఎంపీ అధికారులను ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసుకునేలా అదనంగా ఆర్థికసాయం అందించాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సూర్యఘర్ ద్వారా అర్హులైన వారికి సౌర విద్యుత్ వెలుగులు కల్పించాలన్నారు. బిందు, తుంపర సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చేనేతపార్కు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు సహకరించాలి : కలెక్టర్

జిల్లా అభివృద్ధికి అధికారులంతా సహకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పథకాలు అమలులో పురోగతి కనిపించాలన్నారు. పేదరిక నిర్మూలన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు పాల్గొన్నారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాలకు రూ.212.22 కోట్లు

- రాజధానిలో 4 స్టార్ హోటళ్ల నిర్మాణానికి అనుమతి
- పరిపాలనా ఆమోదం తెలిపిన మంత్రి మండలి



గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు అవసరమైన రూ.212.22 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మిస్తున్న గవర్నర్ నివాస సముదాయంలోని గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నారు. వీటికి సంబంధించి ఎంఈపీ మాత్రమే ఉండే ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో టెండర్లను పర్సంటేజ్ విధానంలో పిలవాలని నిర్ణయించారు. గవర్నర్ నివాస సముదాయ నిర్మాణం పరిపాలనా సామర్థ్యం, రాజ్యాంగ గౌరవాన్ని పెంచుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. విజయవంతమైన బిడ్డర్లను ఆమోదించి, సంవత్సరం గడువులోపు సంబంధిత ప్రదేశాల్లో కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చింది. ఈ క్రమంలో ఒప్పంద తేదీ నుంచి అవసరమైన అన్ని చర్యలు, పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 8న ఏపీసీఆర్డీఏ అథారిటీ చేసిన తీర్మానం నెం.589/2025కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజధానిలో నాలుగు స్టార్ హోటళ్ల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అమరావతిలో సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ 4 స్టార్ హోటల్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.176.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతోపాటు దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా అమరావతిలో 4 స్టార్ హోటల్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ హోటల్లో 400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

కన్వెన్షన్ సెంటర్లకు టెండర్లు

క్వాలిటీ బేస్డ్ సెలక్షన్(క్యూబీఎస్) విధానం ద్వారా నాలుగు ప్రదేశాలలో(ప్రతి దానికి 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా విజయవంతమైన బిడ్డర్లుగా లొకేషన్ 1లో జీ.వీ.హోటల్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియం, లొకేషన్ 2లో మహాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లొకేషన్ 3లో ఓంశ్రీభవనసాయి అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ, లొకేషన్ 4లో వరుణ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లను ఎంపిక చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్లు అమరావతిలో అంతర్జాతీయ సదుపాయాలను అందిస్తాయని మంత్రి మండలి ప్రకటించింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- నేర సమీక్షలో ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలు



బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కరంపై తీసుకున్న చర్యలు, కేసుల పురోగతి, మహిళల అదృశ్యం, గంజాయి, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, చోరీ కేసుల దర్యాప్తుపై ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, శక్తియాప్, మహిళా సంబంధిత చట్టాలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానం, రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సముద్రతీరప్రాంతాల్లో యాత్రికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విచారణలను వేగవంతం చేసి పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం వహిస్తే సాక్ష్యాధారాలు కనుమరగయ్యే అవకాశం ఉందన్నారు. దీపావళి మందుగుండు విక్రయాలు, నిల్వలపై చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచి ఇతరుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా కథనాలు వ్యాప్తి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో సిబ్బందిని నియమించి వారు తరుచు ఆయా గ్రామాలను సందర్శిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించేలా చూడాలన్నారు. నైట్‌బీట్, పెట్రోలింగ్ పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, పి.జగదీష్‌నాయక్, బాలమురళి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సార్లొస్తున్నారు

- 13 నుంచి విధుల్లోకి ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో తీరనున్న టీచర్ల కొరత
- మెగా డీఎస్సీ అభ్యర్థులకు ముగిసిన శిక్షణ
- నూతన ఉపాధ్యాయులకు పల్నాడు, గుంటూరు డీఈవోల దిశానిర్దేశం

గుంటూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ముగిశాయి. దీంతో సోమవారం నుంచి ఆయా ఉపాధ్యాయులు విధులకు హాజరుకానున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నది. ఇప్పటివరకు ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటుతో పాఠశాలలకు కేటాయించారు. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో 13 నుంచి నూతన ఉపాధ్యాయులు బడులకు రానుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్ 3 పరిధిలోని గుంటూరు ప్రకాశం నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 1600 ఉపాధ్యాయ పోస్టులను ఇటీవల డీఎస్సీలో ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ తదితర విభాగాల్లో దాదాపు 1200 మందికిపైగా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఆయా క్యాడర్లలోని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఈ నెల 2 నుంచి నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించింది. ఈ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. వీరంతా ఆయా పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నదని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు రేణుక, చంద్రకళ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

పోస్టింగ్‌ల్లో పల్నాడుకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని బొల్లాపల్లి, మాచవరం, వెల్దుర్తి, మాచర్ల నియోజకవర్గాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయా ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు వచ్చారు. దీంతో అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వెలవెలబోతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల పోస్టింగ్‌లో పల్నాడు జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జిల్లాలో ఇంతకాలం ఉపా ధ్యాయులు లేని పాఠశాలలకు అత్యధికంగా పోస్టులు కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలలు తిరిగి పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది కూడా డీఎస్సీ నిర్వహించి భారీ సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత అంటూ ఉండే అవకాశం లేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనానికి
గుంటూరు బియ్యం
- ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

6

మగవాళ్లకూ
స్త్రీ శక్తి టిక్కెట్లు
- నలుగురు కండక్టర్ల సస్పెన్షన్

అటవీ భూముల రిజిస్ట్రేషన్ కేసులో..
ముగ్గురికి జైలు, జరిమానా

6

ఐటీఐలో 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఐటీఐలో ఈ నెల 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.చినవెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 11 కంపెనీలు పాల్గొంటాయని, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అన్ని రకాల ట్రేడ్‌లు చదివిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

జడ్పీకి రూ.22 కోట్లు ఆర్థిక సంఘం నిధులు

గుంటూరు సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయి. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా సుమారు రూ.22 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టైడ్ కింద రూ.13.56 కోట్లు, అన్ టైడ్ కింద రూ.9.4 కోట్లు విడుదల కానున్నాయి. టైడ్ నిధులను గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, కాల్వల నిర్మాణం, అన్ టైడ్ నిధులు సీసీ, గ్రావెల్ రోడ్ల ఏర్పాటు కోసం వినియోగిస్తారు.

ఖతార్‌లో నర్సు ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా ఖతార్‌లోని దోహాలో రిజిస్టర్ నర్సుల ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, సీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతలు కలిగిన 21 నుంచి 40 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెండేళ్ల అనుభవంతో పాటు పోస్టు రిజిస్ట్రేషన్ ఉండాలని తెలిపారు. వారానికి ఆరు రోజులు, రోజుకు 12 గంటలు పని చేయాల్సి ఉంటుందని, భారత కరెన్సీలో నెలకు రూ.1.20 లక్షలు వేతనం చెల్లించ బడుతుంద తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెజ్యూమ్‌ను స్కిల్ ఇంటర్నేషనల్ ఎట్‌ది రేటాఫ్ ఏపీఎస్ఎఫ్ డీసీ.ఇన్ మెయిల్ ఐడీకి పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

26 ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో 40మంది లోపు విద్యార్థులు ఉన్న 26 ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లోని విద్యార్థులను 2026 మార్చి 23లోపు ఇతర పాఠశాలల్లోకి పంపి, ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. అయితే.. సీనియారిటీ జాబితా తయారు చేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఈతతో మానసిక ఉల్లాసం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్
●ఉత్సాహంగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు



పెద్ది రమణరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జస్టిస్ ఎన్.హరనాథ్



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు, జీడీసీసీ చైర్మన్ మక్కెన, విజేత రజనీకి గోల్డ్ మెడల్ అందిస్తున్న జస్టిస్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈత ద్వారా మానసిక ఉల్లాసం, శ్వాస ప్రక్రియపై ఒత్తిడి తగ్గుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పేర్కొన్నారు. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్యామలానగర్ లో రాష్ట్ర స్థాయి మాస్టర్ స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. తొలుత పోటీలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నగర తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్, ఏపీటీఎస్ చైర్మన్ మోహనకృష్ణ, రెరా డైరక్టర్ దామచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు పెద్ది రమణారావు, కార్యదర్శి ఎం.సత్యానారాయణ మాట్లాడుతూ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దాదాపు 150 క్రీడాకారులు హాజరైనట్లు వెల్లడించారు. ముగింపు కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పోటీలలో మాస్టర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఏడుకొండలు, రాంబాబు నాయక్, సాంబశివరావు, అఖిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధికి చిరునామా: చీఫ్ విప్ జీవీ

● ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల విజయాలు అనితర సాధ్యం

వినుకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాధినేతగా చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధి, ఆధునికత చిరునామా అని, ఆయన విజయాలు అనితర సాధ్యమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక శుభా కాంక్షలు, అభినందనలు తెలిపారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానమే ఒక తరగని పాఠం అన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టింది మొదలు 2004 వరకు 2014-2019 మధ్య, 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చి, 15 ఏళ్లకు పైగా పాలన అందించారన్నారు. వీటిల్లో ఏ దశ చూ సినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేడు నవ్యాంధ్రలు గ్లోబల్ హబ్‌గా తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాయన్నారు. 2020, 2047 ఇలా విజన్ ఏదైనా ప్రజల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యంగా పెట్టు కున్నారని జీవీ అన్నారు. 1999లోనే ప్రఖ్యాత టైమ్ మాగజీన్ నుంచి సౌత్ ఏషియన్ ఆఫ్ ది ఇయర్, 2017లో యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ నుంచి ట్రాన్స్‌ఫార్మేటివ్ చీఫ్ మినిస్టర్ అవార్డ్ ఆయన విజయాలకు సాక్ష్యంగా పేర్కొన్నారు.

కంభంపాడు కెనాల్ వద్ద ఆర్వోబీ నిర్మాణంపై పరిశీలన



పాలువాయిగేట్ రైల్వే ట్రాక్ మ్యాప్ పరిశీలిస్తున్న బృందం

రెంటచింతల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంభంపాడు కెనాల్‌పై రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి ప్రతిపాదనలు, ట్రాక్‌పై రైలు వేగం పెంపుకోసం.. రైల్వే శాఖకు చెందిన రోడ్డు సేఫ్టీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం శుక్రవారం పాలువాయి గేట్ నుంచి రైల్వే ట్రాక్‌ను పరిశీలించింది. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు అధికారులు కంభంపాడు కెనాల్, గన్నవరం ఎల్‌సీ(లెవల్ క్రాసింగ్)ను ఎత్తివేసి రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. కంభంపాడు కెనాల్‌పైన పొడవు 700 మీటర్లు, వెడల్పు 28 మీటర్లు ఉంది. ఇక్కడ 36 మీటర్ల స్టీల్ గడ్డర్, ఆర్‌సీసీ టీ బీమ్‌లు 14 ఏర్పాటుకు డిజైన్ రూపొందించారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్‌పై రైలు వేళ్లే వేగాన్ని 120 నుంచి 180 కిలోమీటర్లకు పెంచేలా చర్యలు చేపట్టనున్నారు. రోడ్డు ఓవర్ బ్రిడ్జికి సమాంతరంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి అన్నదాతలు పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేలా ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే ఆర్‌ఓబీ బ్రిడ్జిపై 25 పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు ప్రసరించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ఆర్‌ఓబీకి సుమారు ఆరు ఎకరాల స్థలం అవసరం ఉండగా ఈ మేరకు మార్కెట్ ధర చెల్లించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.58 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఈ సర్వేలో రైల్వే అధికారులతో పాటు కన్సల్‌టెన్సీకి చెందిన సయ్యద్ చాంద్ బాషా, ప్రేమ్‌కుమార్, వంశీ తదితర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

లిక్కర్ కింగ్ మిథున్‌రెడ్డి లేఖ హాస్యాస్పదం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొన్నూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కింగ్ మిథున్ రెడ్డి లిక్కర్ మాఫియా మీద లేఖ రాయడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. మిథున్ రెడ్డి లేఖ దొంగే దొంగ అని అరిచినట్లుందని ఎద్దేవ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌ను తలదన్నిన స్కాం ఆంధ్రాలో వైసీపీ లిక్కర్ స్కాం అన్నారు. దేశం దృష్టిని ఆకర్షించిన రూ. 3,500 కోట్ల భారీ లిక్కర్ స్కాంలో నిందితుడిగా మిథున్ రెడ్డి ఉన్నారన్నారు. కల్తీ మద్యానికి ఆద్యం పోసింది వైసీపీ ఘనులేనని దుయ్యబట్టారు. పేదల ఆరోగ్యం బలి తీసుకొని సంపదను తమ కంపెనీలకు మళ్లించిన ఘనులు లేఖలు రాయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని ఎద్దేవ చేశారు. వైసీపీ హయాంలో జంగారెడ్డి గూడెం విష మద్యం ఘటనలో 16 మంది మృతి చెందితే కనీసం పరామర్శించని వైసీపీ నాయకులు.. నేడు చిలక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అనుయాయుల ధనదాహానికి వేలాది మంది పేద కుటుంబాలు సమిధులు అయ్యారన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన కోట్ల లిక్కర్ స్కాంపై మిథున్‌రెడ్డి సీబీఐ దర్యాప్తు కోరుతూ ఉత్తరం రాయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 83,888 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 83,888 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచిం తల ప్రాజెక్టులో శుక్రవారం 43.74 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 79,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 65,499, మొత్తం 82,499 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దిగువకు 43,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండ డంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు తోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 61,046 క్యూసెక్కుల వరద నీరు శుక్ర వారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 43,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,339, పశ్చిమ డెల్టాకు 7,026, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

(5వ పేజీ తరువాయి)

ఆలోగా మొత్తం ప్రక్రియను ఓ కొలిక్కి తేవడానికి డ్వామా విభాగం కసరత్తు చేస్తోంది.

నేరుగా యాప్‌లో నమోదు

నరేగా యాప్‌లోనే ఈ కేవైసీ ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దీని ప్రకారం ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉంటున్న ప్రతి శ్రామికుడి వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీ అంకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇకపై పని ప్రదేశంలో శ్రామికుల హాజరు పక్కాగా ఉండడంతో పాటు బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడనుంది. ఇక మీదట పనివేళల్లో రోజుకు రెండుసార్లు ఫేస్ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. ఒకరికి బదులుగా వేరొకరు హాజరు వేసే ప్రయత్నం చేస్తే ఈ కేవైసీ అమలవుతుండడం వల్ల వెంటనే బయటపడనుంది. దీంతో వారికి ఇచ్చే వేతనాన్ని కూడా నిలుపుదల చేయనున్నారు.

పాత విధానంలో అనేక అక్రమాలు

ఉపాధి హామీ శ్రామికుల హాజరు విధానంలో ఉన్న లొసుగులు లోపభూయిష్టంగా ఉండడంతో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏళ్ల తరబడి ఈ మస్టర్ల మాయాజాలం నడుస్తూనే ఉంది. యాప్‌లో గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేయడం వరకే పరిమితమయ్యేది. సంతకాన్ని కూడా ప్రామాణికంగా తీసుకునే వారు. దీంతో మస్టర్ల విషయంలో అనేక ఆరోపణలు వెలుగుచూసేవి. ఉదయం హాజరు వేయించుకుని పని ప్రదేశం నుంచి వెళ్లిపోవడం మొదలుకుని, అర్హత లేని వారికి కూడా రాజకీయ సిఫారసులతో జాబ్ కార్డులు ఇప్పించుకుని ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించేవారు. నవంబరు నుంచి అమలవబోతున్న నూతన విధానంలో రోజుకు రెండు సార్లు ముఖ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో మస్టర్ల విషయంలో ఇకపై ఎలాంటి అక్రమాలకు తావుండదని, అర్హతే ప్రామాణికంగా జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పనిచేసిన వారికే వేతనం పక్కాగా అమలు కానుందని అధికారులు చెబుతున్నారు.

ఆంజనేయస్వామి ఆభరణాలు మాయం

యడ్లపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామికి భక్తులు సమర్పించిన ఆభరణాలను కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ ఆలయం బాధ్యతలను సంఘ సభ్యులే పర్యవేక్షిస్తుంటారు. 2016 నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలను చూస్తున్న.. సంఘం ఉపకోశాధికారి మద్దుల రమణారావు చూస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారి అలంకరణకు అవసరమైన నగలను ఇవ్వాలని ఆర్యవైశ్యులు రమణారావును కోరారు. ఈ క్రమంలో రమణారావు భార్యాపిల్లలతోపాటు సంఘ భవనం, స్వామివారి ఆభరణాలు దాచి ఉంచిన బీరువా తాళాలు తీసుకుని గ్రామం విడిచి వెళ్లిపోయాడు. దీంతో సభ్యులంతా కలసి నూతన కమిటీని ఎన్నుకుని గ్రామ పెద్దల సమక్షంలో సంఘ భవనం తాళాలను తెరిచి గదులను పరిశీలించారు. స్వామివారి ఆభరణాలు దాచిన బీరువాను తెరిచి చూడగా స్వామివారి ఆభరణాలు కనిపించలేదు. ఇన్నేళ్లుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రమణారావే స్వామి వారి ఆభరణాలను మాయం చేశాడని నిర్ధారించుకుని.. శుక్రవారం సంఘ సభ్యుడు పోతుగంటి పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ.8లక్షలకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తను అధ్యక్షుడిగా నూతన కమిటీని ఏర్పాటు చేసి, ఆర్యవైశ్య సంఘ భవనాన్ని తన భార్య పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని.. బ్యాంకు రుణం పొందడానికి రమణారావు గతంలో యత్నించారు. దీంతో సంఘ సభ్యులు పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

దాచేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. తాపీ మేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనగర్ సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరిగింది. మృతుడు ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన ముట్లూరి అంజయ్య(35)గా గుర్తించారు. అంజయ్య తెలంగాణలోని భువనగిరిలో తాపీ పని చేస్తూ.. శుక్రవారం రాత్రి భార్యబిడ్డల వద్దకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతని తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అటవీ భూముల రిజిస్ట్రేషన్ కేసులో..

ముగ్గురికి జైలు, జరిమానా

వినుకొండటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం పేరూరుపాడు అటవీ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి పాస్ పుస్తకాలు తీసుకున్న ఘటనపై వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శిక్షలు ఖరారు చేసినట్లు బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. తప్పుడు డాక్యూమెంట్లు సృష్టించి బ్యాంకులో రుణాలు పొందడంపై వినుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అప్పటి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ ముగ్గురికి లక్ష రూపాయలు జరిమానా విధించి.. మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

హలో.. నేను పోలీస్ అండి..

డబ్బులు ఫోన్ పే చేయండి!

కారంపూడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో కొత్త రకం మోసం శుక్రవారం వెలుగుచూసింది. నెల రోజుల క్రితం జరిగిన ఆన్‌లైన్ మోసం మరువక ముందే రెండో మోసానికి దుండగులు తెరలేపారు. శుక్రవారం చెక్‌పోస్టు సెంటర్లో మూసి ఉన్న దుకాణాదారునికి ఓ వ్యక్తి ఫోన్ చేసి..'ఈ రోజు నా కుమార్తె పుట్టిన రోజు.. నేను నా మొబైల్ నుంచి గూగుల్‌పే ద్వారా డబ్బు పంపలేకపోతున్నాను.. మీరు నాకు సాయం చేయండి.. నేను మీకు గూగుల్‌పే ద్వారా డబ్బు పంపిస్తాను.. మీరు ఫోన్‌పేలో పంపండి.' అని చెప్పాడు. సదరు దుకాణం యజమాని ఇది నమ్మి డబ్బు పంపించాడు. నెల రోజుల క్రితం ఎస్‌బీఐ బ్యాంకు సెంటర్లో ఒక నెట్ సెంటర్ వ్యక్తికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఏఎస్ఐని మాట్లాడుతున్నానని కానిస్టేబుల్‌కు యాక్సిడెంట్ జరిగింది.. పిడుగురాళ్ల వైద్యం చేస్తున్నామని.. అర్జెంట్‌గా డబ్బులు కావాలి అంటూ రూ. 65 వేలను ఫోన్‌పే చేయించుకొన్నాడు. ఇలాంటి ఘటనలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇంటర్నెట్, మొబైల్ ఆధారిత మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వాసు హెచ్చరించారు. పోలీసు అంటూ ఫోన్ కాల్ చేసిన వారికి డబ్బు పంపి మోసపోవద్దని సూచించారు.

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సంచలం సృష్టించిన తండ్రికొడుకుల కిడ్నాప్, హత్య కేసులో నిందితులైన బెంగళూరుకు చెందిన నారాయణస్వామి, శ్రీధర్‌ను కడియాల వైద్యశాల వద్ద శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ సీఐ చరణ్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. దీంతో ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

41,281 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 42,595 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,281 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	15200
273	10500	12500	నెంబరు. 5	10000	14200
341	10000	15200	341	10000	15500
4884	---	---	4884	10000	14500
సూపర్ 10	---	---	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7700

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



చైల్డ్ హెల్ప్‌లైన్ గోడపత్రికలను అవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తదితరులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహ రహిత జిల్లాగా చేసేందుకు అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన బాల్య వివాహాలు చట్టరీత్య నేరం, ఉచిత అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ గోడపత్రికలను ఎంపీ, కలెక్టర్ కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరు కలిసికట్టుగా పనిచేసి బాల్యవివాహాలను పూర్తి స్థాయిలో నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి నగదు ప్రోత్సహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదగొల్లపాలెం హైస్కూల్ విద్యార్థినికి ఎంపీ, కలెక్టర్ ప్రశంసలు

కర్లపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పెదగొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని యారం ఏంజెల్ అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించటం అభినందనీయమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌లు అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం యారం ఏంజెల్‌కు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌లు రూ.2 వేల నగదు, పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా యారం ఏంజెల్‌ను ప్రధానోపాధ్యాయురాలు పి.సుభాషిణి, ఉపాధ్యాయులు దత్, వెంకటేష్, మల్లికార్జునరెడ్డి, బాపూజీరెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు, ఆదంబీలు ప్రత్యేకంగా అభినందించారు. తమ కుమార్తె కలెక్టర్ చేతుల మీదగా బహుమతి అందుకోవటంపై తల్లిదండ్రులు యారం రత్నం, కృపా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సుష్మిత, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మనబోయిన సాంబయ్య, పబిడి భాస్కరరావులు విద్యార్థినిని అభినందించారు.



కలెక్టర్, ఎంపీ చేతులమీదగా నగదు, పుస్తకాలు అందుకుంటున్న యారం ఏంజెల్

హైకోర్టు వ్యాఖ్యలు జగన్‌కు చెంపపెట్టు : కొల్లా

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జగన్ దారుణ పరాజయ పరాభవం తర్వాత పరామర్శలకు వచ్చినా, పర్యటనలకొచ్చినా తాను పెంచి పోషించే పేటిఎం, గంజాయి, లిక్కర్ బ్యాచ్‌ల అసాంఘిక, అరాచక, పైశాచిక వైసీపీ మూకలు గందరగోళం సృష్టించి జగన్ భజన చేయటం రివాజుగా మారిందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. జగన్ జమానాలో ఆర్భాటంగా ప్రకటించిన 17 మెడికల్ కళాశాలల్లో ఐదింటిని మాత్రమే అరకొర పూర్తి చేసిన మిగిలినవి మెజారిటి పునాదులతోనే కునారిల్లు తున్నాయన్నారు. పీపీ విధానంలో మిగిలిన అన్నిటిని పూర్తిచేసి నష్టం వాటిల్లకుండా అందుబాటులో తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమంపై విషం చిమ్మేందుకు జగన్ విధ్వంసకశక్తిలా, రాజ్యాంగేతరంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టు ధర్మాసనం పీపీపీ విధానంలో టెండర్లు పిలవటంలో తప్పులేదని ఆ నిర్ణయాలు చట్ట విరుద్ధంకావని వ్యాఖ్యానించటం జగన్‌కు చెంపదెబ్బ అవుతుందని కొల్లా పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ ఆవిష్కరించిన డీఈవో

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు సంబంధించిన మెంటల్ ఎబిలిటి టెస్ట్ మెటీరియల్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విద్యార్థులకు ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ మెటీరియల్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడా వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, నన్నేరయ్య, బీవీ శ్రీనివాసరావు, రమేష్, కళాధర్, బాపూజీరెడ్డి, రంగారెడ్డి, సాంబయ్య, శేషుబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.



ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం

సమాజంలో మహిళలకు అత్యంత స్థానం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురుషులతో సమానంగా సమాజంలో మహిళలకు అత్యంత స్థానం ఉందని పిట్టలవానిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శేఖర్ అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీపడావో, బేటీబచావో కార్యక్రమంలో భాగంగా బాపట్ల సీడీపీవో శివపార్వతి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మహిళల సాధికారిత సాధించేందుకు, వారి ఆర్థిక స్వావలంబనకు ఎనలేని కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇన్‌చార్జి ఎంఈవో -1 శివబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ స్థాయి నుండే చిన్నారులను విద్యాపరంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదివే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. చందోలు, ఖాజీపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు బొలగాని జ్యోతిలక్ష్మి, వి.రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ శేఖర్

ఇన్‌చార్జి డీఆర్‌వోగా ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ సెలవుపెట్టటంతో ఇన్‌చార్జిగా ఆర్డీవో పి.గ్లోరియాను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్‌వో గంగాధర్‌గౌడ్ జాయిన్ అయ్యేవరకు ఆమె ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

ఉమ్మడి జిల్లా హాకీ బాలబాలికల జట్లు ఎంపిక

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల హాకీ జట్ల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో డి.ప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బాలబాలికలు నుంచి 18 మంది చొప్పున రెండు జట్లను ఎంపిక చేశారు. వీరు తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో జరిగే 69వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ కృష్ణారావు, ఎం.గోపి, బి.గంగాధర్, ఎం.సాంబశివరావు, వాణిసుశీల, ఎన్‌టి రాంబాబు, కరణం బలరాం, పువ్వాడ బసంత్‌కుమార్, వి.వెంకట్, బి.నాగరాజు, విక్టోరియమ్మ పాల్గొన్నారు.

దేవదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవదాయ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దేవదాయశాఖ భూముల పరిరక్షణకు జిల్లా స్థాయి కమిటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దేవదాయ శాఖకు చెందిన భూములు, ఆస్తుల వివరాలను మండలాల వారిగా జాబితాలను తయారు చేయాలని చెప్పారు.భూములు ఆక్రమణలకు గురైతే చూస్తూ ఊరుకుంటే సహించేది లేదన్నారు. రైతు వారి భూములు దేవదాయ శాఖకు చెందిన భూములుగా రికార్డులలో పొరపాటుగా నమోదైతే వాటికి సంబంధించిన ఎన్‌వోసీలు జారీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాష్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, ఆర్డీవో పి.గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మికుల నిర్మూలన కమిటీ, కార్మిక సెస్ వసూళ్ళ కమిటీ, ఈశ్రం జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లను గమనించాలన్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలను సేకరించాలన్నారు. జిల్లాలోని హేచరీలు, కాటన్‌మిల్లులు, గ్రానైట్ క్వారీలు, దుకాణాలలో పనిచేస్తున్న పిల్లలను గమనించి సంబంధిత యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని తెలిపారు.



దేవదాయ భూముల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

● ప్రభుత్వ, ప్రైవేట్ భవన నిర్మాణదారులు నుంచి ఒక శాతం లేబర్‌సెస్ వసూళ్ళు చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వసూళ్ళు చేసిన సెస్‌ను కార్మికశాఖకు చలానా రూపంలో అందజేయాలన్నారు. ఈ కార్మిక సెస్ 10 లక్షలకు మించి నిర్మించే ప్రైవేట్ భవనాలకు, ప్రభుత్వం నిర్మించే ప్రతి భవనానికి అమలు చేయాలన్నారు. వివిధ రంగాలలో పని చేసే అసంఘటిత కార్మికుల పేర్లను ఈశ్రం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కార్మికశాఖ సహాయ కమిషనర్ వెంకట శివ ప్రసాద్, వ్యవసాయ మార్కెటింగ్ మేనేజర్ రమేష్, మత్స్యశాఖ ఉపసంచాలకులు గాలిదేవుడు, వ్యవసాయ శాఖ జేడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖాధికారిణి జె.రాజాదెబోరా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించాలి

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ జి.మురళికృష్ణ

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ జి.మురళికృష్ణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం వివిధ వ్యాపార సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సదస్సులో గృహోపకరణాల మీద తగ్గిన జీఎస్టీ గురించి అవగాహన కల్పించారు. కమిషనర్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జీఎస్టీలో వచ్చిన మార్పులు గురించి వివరించారు. తగ్గించిన జీఎస్టీ ద్వారా కొనుగోలుదారుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందనే విషయాన్ని తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డిప్యూటీ ఏసీ కనికిరెడ్డి, వ్యాపార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు

కర్లపాలెంలో...

కర్లపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' కార్యక్రమం పై మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులపై తగ్గిన ధరల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్‌పాషా, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చుండూరులో...

చుండూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలలో కొనుగోలు శక్తి పెరుగుతుందని, 15 రకాల పన్ను చట్టాలను రద్దు చేసి ఒకే పన్ను విధానాన్ని అమలు చేస్తుందని ఎంపీడీవో సుదీప అన్నారు. మండల కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిత్యవసర వస్తువులు, మందులు, జీవిత బీమా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, ఈ సూపర్ జీఎస్టీ గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికారాదు

● ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ పేర్లి సందీప్



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ పేర్లి సందీప్

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికారాదని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ పేర్లి సందీప్ తెలిపారు. పట్టణంలోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దండే యజ్ఞ నారాయణ, కార్యదర్శి జి.శివరామకృష్ణ, కోశాధికారి బొనిగల రాజేంద్రప్రసాద్, జిల్లా కో ఆర్డినేటర్ గోపాళం రఘుపతిరావు, జోన్ చైర్మన్ ఆలపర్తి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి సత్యనారాయణ, నాగేశ్వరరావు, శిఖరం ఫణిరాజశయన్, తిమ్మరాజు గౌరిప్రసాద శర్మ, ఇక్కుర్తి శ్రీనివాసరావు, నాగమణి పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో న్యాయ అవగాహన సదస్సు

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ మెంటల్‌హెల్త్‌డే సందర్భంగా బాపట్ల ఏరియా వైద్యశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. డిస్ట్రిక్ మెంటల్ హెల్త్‌టీమ్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ ఒంటరితనం, కుటుంబ సమస్యలు, పనిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి వంటి కారణాలతో శారీరక, మానసిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ సదస్సులో ఆసుపత్రిసూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ, న్యాయవాదులు భీమా లీలాకృష్ణ, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, డాక్టర్ ఐ.సుజాత, ఆర్ఎమ్‌వో, ఆసుపత్రి సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై భాష్యం విద్యార్థుల అవగాహన ర్యాలీ

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భాష్యం స్కూల్ విద్యార్థులు శుక్రవారం ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 200 మంది విద్యార్థులు ప్లేకార్డులు పట్టుకొని ట్రాఫిక్ నియమనిబంధనలు గురించి ప్రజలకు వివరిస్తూ చైతన్యం కలిగించారు. ట్రాఫిక్ రూల్స్‌పై నృత్య ప్రదర్శన చేశారు. జోనల్ ఇన్‌చార్జి హృదయ్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా రహదారి భద్రతను కాపాడుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న భాష్యం స్కూల్ విద్యార్థులు

గ్రామాలను పరిశుభ్రత, పచ్చదనంతో తీర్చిదిద్దాలి

● ఎంపీడీవో నరసింహారావు



మాట్లాడుతున్న ఎంపీడీవో నరసింహారావు

కొల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రతతో పాటు పచ్చదనంతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో కె.నరసింహారావు అన్నారు. కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామర్థ్య నిర్మాణ శిక్షణ థీమ్-5పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీవో పాల్గొని గ్రామ పంచాయతీల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించేలా సీఆర్‌పీలతో గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించే చర్యలను తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కల్పించాల్సిన సదుపాయాల గురించి ఆయా శిక్షణ కార్యక్రమాల్లో వివరించారు. 24 గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో రసాయన వినియోగం ప్రమాదకరం


చుండూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో నానాటికి పెరుగుతున్న రసాయన ఉత్పత్తుల వినియోగం వలన శారీరక అనారోగ్యం, ప్రకృతి అసమతుల్యత ఏర్పడుతున్నాయని మోదుకూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రం తులసి వనం నిర్వాహకుడు గోగిరెడ్డి రాజేంద్రరెడ్డి అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రకృతి వ్యవసాయం కోర్సు విద్యార్థులకు శుక్రవారం ఈ క్షేత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ, తరతరాలకు అమృతతుల్యమైన ఆహారం, గాలి, నీరు అందాలంటే ప్రకృతి సాగు విధానాన్నే అవలంబించాలన్నారు. ఇక్కడ 1.30 ఎకరాలలో 150కి పైగా వివిధ రకాల ఔషధ మొక్కలు కొబ్బరి, అరటి, జామ, కలివేపాకు, ములగ మొదలైన సాగు విధానాలను ఆచార్య రంగా విశ్వ విద్యాలయానికి చెందిన 30 మంది విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీలత, ప్రొఫెసర్ ధర్మారం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులు

మాజీ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్యకు శివప్రసాద్ పరామర్శ

చెరుకుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రేపల్లె మాజీ ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నాయకుడు వెంకటసుబ్బయ్యను టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ పరామర్శించారు. నడింపల్లిలోని ఆయన కుమార్తె, ప్రముఖ వైద్యురాలు విజయలక్ష్మి ఇంటిలో ఉంటున్న ఆయనను శుక్రవారం శివప్రసాద్ పరామర్శించి యోగక్షేమాలు విచారించి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామన్నారు. ఆయనతోపాటు కేడబ్ల్యూడీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, కావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మండవ తాతాజీ, టీడీపీ నాయకులు గోగినేని వెంకట సుబ్బారావు, నడింపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొడాలి శేషతల్పసాయి పాల్గొన్నారు.



వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న శివప్రసాద్

12 మందికి ఉద్యోగాలు

నగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో స్థానిక శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ముందు వరుసలో ఉంటుందని కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. దివీస్‌లాబోరేటరీస్‌లో ఉద్యోగార్థుల కొరకు శుక్రవారం వాక్‌ఇన్‌ఇంటర్వ్యూ నిర్వహించారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి తెలి పారు. ఇంటర్వ్యూలో 60 మంది యువతీ, యువకులు పాల్గొనగా 12 మంది ఎంపికయ్యారన్నారు. 28 మంది ఫిబ్రవరిలో జరుగు సెకండ్ ఫేజ్‌కు షార్ట్‌లిస్ట్ అయ్యారని దివీస్ ల్యాబొరేటరీస్ హెచ్ఆర్ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది సెలెక్ట్ అయిన వారిని అభినందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

కొల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు దాతలు క్రీడా దుస్తులు శుక్రవారం అందజేశారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో 1972-73 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 24 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు హెచ్‌ఎం గుదిబండి రజనీకాంత్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కొమ్ము తులామాను తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూర్యదేవర భరత్‌కుమార్, భాగవతుల సూర్యనారాయణమూర్తి, మొవ్వా శశిధర్, గాడేపల్లి రామకృష్ణప్రసాద్, సూర్యదేవర శివాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

నగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీరు అందించడం ద్వారానే ప్రజలు రోగాలబారినపడకుండా ఉంటారని మంత్రిసోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పూడివాడలో రూ.64.5 లక్షలతో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలపరిధిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేస్తున్నామని వివరించారు. అనంతరం పూడివాడలో పిట్టుమహేష్‌రెడ్డి గృహం ఇటీవల విద్యుత్‌షాక్‌తో దగ్ధమైన కారణంగా ఆర్థికసాయం, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, రైస్‌మిల్ అసోసియేషన్ సెక్రటరీ కాసాని శ్రీనివాసరావు, గుడివాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోర్ల శ్రీనివాసరావు, పాగోలు కోటేశ్వరరావు, గుడారంకయ్య, ఆళ్ళ పూర్ణయ్య పాల్గొన్నారు.



పూడివాడలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అనగాని శివప్రసాద్

బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలురతో దీటుగా బాలికలు విద్య, క్రీడా రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహిళా శక్తివికాస ఇన్‌చార్జ్ సుభాషిణి అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల్లో బాలికల హక్కులు, సమాన అవకాశాలు, శక్తి వికాసంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలిక ఒక కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి ఆశాకిరణమని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ సీహెచ్ హిమబిందు, రాధిక పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మహిళా శక్తి వికాస ఇన్‌చార్జ్ సుభాషిణి, సీడీపీవో సుచిత్ర

కావూరు ప్రభుత్వ పాఠశాలలో...

చెరుకుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కావూరు ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షించుకుందాం అనే విషయంపై డిబేటు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కావూరు సర్పంచ్ సీహెచ్ జ్యోతి, హైస్కూల్ హెచ్‌ఎం వనజాక్షి, హెల్త్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేవీ సుబ్బమ్మ, ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

14న అంబేడ్కర్ 70వ దమ్మ దీక్షా దిన వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 70వ దమ్మ దీక్షా దిన వేడుకలను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి దోవ రమేష్‌రాంజీ తెలిపారు. భట్టిప్రోలులోని బౌద్ధ స్తూపం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను సొసైటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1956 అక్టోబరు 14న నాగపూర్ వేదికగా ఆరున్నర లక్షల మంది దళితులు అంబేద్కర్‌తో కలిసి బౌద్ధాన్ని స్వీకరించారన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా బౌద్ధ దమ్మ దీక్షా దిన వేడుకలు దళిత బుద్ధిస్ట్ సంఘాలు నిర్వహిస్తున్నాయన్నారు. 14న జరిగే కార్యక్రమానికి ప్రముఖ బుద్ధ రచయితలు గోవర్ధన్, కంచర్ల శేషుకుమార్, బొనిగల రామారావు, తంగిరాల సోని, అంబేద్కర్‌వాదులు అతిథులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు పి.కోటయ్య, సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, బి.ప్రసాద్, జాకబ్, పేర్లి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ స్తూపం వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు

నేడు విద్యుత్ సరఫరాకు...

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విద్యుత్‌లైన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటలు నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. రెండో శనివారం అన్ని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు జరుగుతాయన్నారు.

● రేపల్లె : పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణగా రేపల్లె పట్టణం, రూరల్ మండలంలోని అన్ని గ్రామాలు, భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు.

● చెరుకుపల్లి : చెరుకుపల్లి సబ్‌స్టేషన్‌లో శనివారం 33/11 కేవీ మరమ్మతుల నిమిత్తం చెరుకుపల్లి, కావూరు, రాంబొట్లపాలెం, తుమ్మలపాలెం, బలుసులపాలెం, ఆరుంబాక, ఊచావారిపాలెం గ్రామాలలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ బి.పోతురాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● కొల్లూరు : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కుర్రా సుధాకరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా కొల్లూరు, గాజుల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, దోనేపూడి, కోటిపల్లి, తాడిగిరిపాడు, చినపులివర్రు, రావికంపాడు, క్రాప, బొద్దులూరుపాడు యాదవపాలెం, వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి, కుచ్చెళ్లపాడు, యల్లబాడు గ్రామాలతో పాటు పోతార్లంక ఎత్తిపోతల పథకానికి కూడా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

● వేమూరు : వేమూరు, పెరవలి సబ్ స్టేషన్‌ల మరమ్మతులు కారణంగా మండల పరిధి గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ తెలిపారు.

పలు క్రీడలలో గణపవరం విద్యార్థుల ప్రతిభ

కర్లపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం హైస్కూల్ విద్యార్థులు కబడ్డీ, చెస్, యోగా ఆటలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉల్లిపాలెం జడ్పీ స్కూల్‌లో కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహించినట్లు, అండర్-17 బాలుర విభాగంలో ఎ.నాగజ్యోతి జిల్లా స్థాయికి, అండర్-14 విభాగంలో ఐలవరం జడ్పీహైస్కూల్‌లో జరిగిన యోగా పోటీలలో ఎ.జగన్మోహనరెడ్డి, కళ్యాణి, అండర్-17 బాలురలో విజయకార్తీక్, ఎస్‌వీ తనూజ్‌రెడ్డి, రూపేస్‌కుమార్, బాలికలలో బాలకృష్ణవేణి, వి.భవిష్య, బీచ్ వాలీబాల్‌కు రిచర్డ్‌సన్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

మధ్యాహ్న భోజనానికి గుంటూరు బియ్యం

- ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఖరీఫ్‌లో నాణ్యమైన ధాన్యం సేకరించాలని ఆదేశాలు
- తేమ శాతం 17 కంటే తక్కువగా ఉన్నవే కొనుగోళ్లు



ఓ మిల్లులోని బియ్యపు బస్తాలు(ఫైల్‌ఫొటో)

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గుంటూరు జిల్లా బియ్యం సరఫరా జరగనుంది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ నుంచి ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. ప్రభుత్వ ఆదేశాల దృష్ట్యా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల వద్ద నాణ్యమైన ధాన్యంని మాత్రమే సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం వివిధ రకాల పరీక్షలను కొనుగోలు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. అంతకంటే ఎక్కువ ఉంటే ఆ ధాన్యాన్ని తిప్పి పంపించేసి తేమ శాతం తగ్గిన తర్వాతనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచిస్తారు. ప్రభుత్వ ఆదేశాలపై ఇప్పటికే గ్రామ వ్యవసాయాధికారులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, తహసీల్దార్లు, హెల్పర్స్, మిల్లర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గత ఏడాది కంటే క్వింటాల్‌కు మద్దతు ధరని ప్రభుత్వం రూ. 69 పెంచింది. దీని వలన కామన్ వెరైటీ క్వింటాల్ రూ. 2,369, గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యానికి రూ. 2,389 చెల్లిస్తారు. 40 కేజీల గోనె సంచులు రూ. 4.74కి అందిస్తారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించదలచిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. లేకుంటే ధాన్యం కొనుగోలు చేయరు.

ఐదు రకాల నాణ్యత పరీక్షలు

గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యం కొనుగోలు చేసే ముందు ఐదు రకాల నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యంలో వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన గింజలు, తక్కువ శ్రేణివి, తేమ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం అవసరమైన పరికరాలను సంబంధిత సిబ్బందికి అందజేశారు. పైన పేర్కొన్న ఐదు రకాల పరీక్షల్లో పాస్ అయిన ధాన్యాన్నే కొనుగోలు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం సేకరణకు టెక్నికల్ సిబ్బంది రైతుల కళ్లాల వద్దకే వచ్చి నాణ్యత పరీక్షలు జరుపుతారు. అన్ని సవ్యంగా ఉంటే రైతు వేలిముద్రని తీసుకొని ధాన్యం సేకరించి జీపీఎస్ అమర్చిన వాహనం ద్వారా మిల్లుకు తరలిస్తారు.

43,714 పాఠశాలల్లో 29.71 లక్షల మంది విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 43,714 పాఠశాలలున్నాయి. వీటిల్లో 29 లక్షల 71 వేల 238 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. వీళ్లందరికి మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని వడ్డించాల్సి ఉంటుంది. వీటన్నింటికి కలిపి దాదాపుగా 4 లక్షల 45 వేల 68 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి. పాఠశాలలే కాకుండా హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటికి ప్రతీ ఆరు నెలలకు మరో 58 వేల 26 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి.

90 మిల్లులున్నా 24 మంది మాత్రమే ఆర్ఎస్‌కేలలో కొనుగోళ్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 90 రైస్‌మిల్లులు ఉన్నాయి. కాగా వీళ్లలో 24 మంది మిల్లర్లు మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు బియ్యం మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాలంటే చాలా కష్టం. ఈ సమస్యని అధిగమించేందుకు మిల్లర్లందరిని, రైతులకు అనుసంధానం చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయించాల్సి ఉంది. తేమ శాతం విషయంలో మిల్లర్లు కొంత అభ్యంతరాలు వ్యక్తం చేస్తోన్నారు. ఈ విషయంలో జాయింట్ ఎనాలిసిస్ జరపాలని కోరుతున్నారు.

మునిసిపాలిటీల్లో ఈడీసీ

- నాలాకు బదులు కొత్త విధానం అమలు
- భూమి విలువలో నాలుగు శాతం పన్ను



సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయం

సత్తెనపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చడానికి గతంలో నాలా ట్యాక్స్ అమల్లో ఉండేది. ప్రజా సౌలభ్యం కోసం దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందట రద్దు చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎటువంటి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి.. నాలాకు బదులు ఎక్స్‌ట్రనల్ డెవలప్‌మెంట్ చార్జెస్(ఈడీసీ) విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబరు 3న ఆదేశాలు జారీ చేసింది. దీని అమలుపై గత బుధవారం ప్రత్యేక జీవో కూడా విడుదలైంది. దీని ప్రకారం కార్పోరేషన్‌లు, మునిసిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా టౌన్ ప్లానింగ్ చట్టం 1920 కింద అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2006 జనవరి 2కు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది. గతంలో నాలా పన్నులు వసూలు చేస్తే కేవలం రెవెన్యూ శాఖకు నగదు జమ అయ్యేది. దీన్ని బదలాయించాల్సి ఉన్నా ప్రత్యేక అజమాయిషీ లేక పోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేది. కాని కొత్త విధానంలో నిధులు మొత్తం మునిసిపాలిటీలోని మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్, బ్రిడ్జిలు, పార్కుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దీన్ని అమలు చేసే బాధ్యత ఆయా మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల కమిషనర్లకు అప్పగించింది. నిబంధనల ప్రకారం నాలా చెల్లించని లే అవుట్ దారులు.. కొత్తగా ప్రవేశ పెట్టిన ఈడీసీ చట్టం ప్రకారం పన్నులు చెల్లిస్తే పురపాలక సంఘాలకు అదనంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ, మునిసిపల్ అధికారులపై ఉంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

గతంలో లే అవుట్లు వేయాలంటే మునిసిపాలిటీల్లో దరఖాస్తు చేసుకుంటే సరి పోయేది. కాని ప్రస్తుతం అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లో ఏపీ డీసీఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే సంబంధిత రుసుం చెల్లించాలి. మొత్తం భూమి, వాటి విలువ, ఏ ప్రాంతంలో ఉందనే వివరాలను అందులో పొందుపరచాలి. భూమి విలువలో నాలుగు శాతం ఈడీసీగా చెల్లించాలి. ఇందులో 85 శాతం నిధులు ఆయా మునిసిపాలిటీల ఖాతాల్లోను, మిగిలిన 15 శాతం అభివృద్ధి అథారిటీకి వెళ్తుంది. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటే రెట్టింపు జరిమానా విధిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

బాపట్లలో.. కారవాన్ టూరిజం

- సూర్యలంక తీరంలో కొలువు తీరిన వాహనం
- పర్యాటక ప్రాంతాలను వీక్షించే అద్భుత అవకాశం



సూర్యలంక సముద్రతీరంలో ప్రదర్శన కోసం ఉంచిన కారవాన్

బాపట్ల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను తనివి తీర పర్యాటకులు తిలకించి, ఆస్వాదించేలా పర్యాటకశాఖ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధునాతన హంగులతో కూడిన కారవాన్ బస్సును ఏర్పాటు చేసింది. ఇందులో ప్రయాణిస్తూ పర్యాటక ప్రదేశాలను సందర్శించే అద్భుతమైన అవకాశం కల్పించింది. బాపట్ల మండలంలో అత్యంత ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో యాత్రికుల సందర్శన కోసం కారవాన్‌ను ఉంచారు. దీనిని ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పర్యాటకశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. కారవాన్‌లో ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకు అన్ని సౌకర్యాలు అందులోనే ఉంటాయి. దూరప్రాంతాలు నుంచి ఈ బస్సులో షికారు చేస్తూ.. బాపట్ల సముద్ర తీరానికి వచ్చి సరదాగా గడిపి మళ్లీ తిరిగి గమ్య స్థానాలకు చేరే ప్రణాళిక రూపొందించారు.

15 మంది వరకు ప్రయాణించవచ్చు..

సముద్రతీరం నుంచి బయులు దేరే ఈ బస్సులో 300 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయవచ్చు. బాపట్ల జిల్లాలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కారవాన్ టూరిజం ప్రారంభించారు. బీచ్‌లలో వసతి సమస్యకు పరిష్కారంగా విలాసవంతమైన ఈ బస్సు ఉపయోగపడుతుంది. ఈ బస్సులో 15 మంది వరకు ప్రయాణించి.. బస చేయవచ్చు. సాధారణ ప్రయాణం కంటే తక్కువ ఖర్చుతో బీచ్‌లు, ఆలయాల సందర్శన ఉంటుంది. హైదరాబాద్ వంటి నగరాలు నుంచి వారాంతాలు, పండుగ సెలవుల్లో వేలాది మంది పర్యాటకులు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లకు వస్తుంటారు. దీంతో పర్యాటక శాఖ కాటేజీలు, ప్రైవేట్ రిసార్ట్‌లు నెలరోజుల ముందే పూర్తిగా బుక్ అయిపోతున్నాయి. సరైన వసతి లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక శాఖ ఈ కారవాన్‌లు నడపనుంది.

రూ.50 వేల లోపే అన్ని సౌకర్యాలు..

- హైదరాబాద్ నుంచి కార్లలో బాపట్ల బీచ్‌లకు వస్తే ప్రయాణం, బస, ఇతర ఖర్చులు కలిపి రూ.60 వేలు నుంచి రూ.70 వేల వరకు అవుతాయి. కారవాన్ ప్యాకేజి రూ.40వేల నుంచి రూ.50వేల ఖర్చుతోనే యాత్రను పూర్తి చేయవచ్చు. సౌకర్యవంతంగా బస చేయవచ్చు. బస్సులోనే వంట మనిషి, పర్యాటక ప్రదేశాలు గురించి వివరించేందుకు ఒక గైడ్ కూడా ఉంటారు. పర్యాటకులు కోరినచోట వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకునే వెసులబాటు ఉంది.

కారవాన్ ప్యాకేజీ ఇలా..

- కారవాన్ ప్యాకేజిలో భాగంగా సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లతోపాటు బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయం, మోటుపల్లి వీరభద్రస్వామిఆలయం, చీరాల వస్త్రపరిశ్రమ, వేటపాలెం జీడిపప్పు కేంద్రాలను సందర్శించవచ్చు. అదేవిధంగా నిజాం పట్నం హార్బర్ కూడా వెళ్ళవచ్చు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యలంక సముద్రతీరంలో సందర్శన కోసం ఉంచి కారవాన్‌ను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఏసీ బెడ్‌రూమ్, టాయిలెట్స్, ఇంటర్నేట్, వైఫై, టీవీ, ఫ్రిడ్జ్, సోఫా సెట్ వంటి విలాసవంతమైన సౌకర్యాలు ఈ బస్సులో ఉన్నాయి.

కారవాన్‌లో పర్యాటకుల కోసం కల్పించిన వసతులు





నిరంతరాయ

విద్యుత్ సరఫరాలో అలసత్వం వద్దు

- ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణం స్పందించాలి
- స్కాడా సెంటర్‌లో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్ ఆకస్మిక తనిఖీలు



స్కాడా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఈఈ శ్రీనివాసబాబు

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఎవరూ అలసత్వం చూపొద్దని ఏపీ సీపీ డీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. జిల్లా కేంద్రం గుంటూరు సంగడిగుంట వద్దనున్న విద్యుత్ భవన్‌లోని స్కాడా సెంటర్‌లో ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం గుంటూరు, తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)లు, డిప్యూటీ ఈఈలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సెక్షన్ కార్యాలయాల స్థాయిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణమే స్పందించాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్‌లను ఎప్పటికప్పుడు విడుదల చేయాలన్నారు. గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులున్నారు.

మగవాళ్లకూ 'స్త్రీ శక్తి' టిక్కెట్లు

- నలుగురు కండక్టర్‌ల సస్పెన్షన్
- టీటీఐల తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం క్షేత్రస్థాయిలో పక్కదోవ పట్టే ప్రయత్నం జరుగుతోంది. కొందరు కండక్టర్‌లు మగవాళ్లకూ స్త్రీ శక్తి పథకం కింద జీరో ఫెయిర్ టిక్కెట్‌లను జారీ చేయడం ఇటీవల టీటీఐల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఆయా అక్రమాలపై విభజిత జిల్లాలో నలుగురు కండక్టర్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. కండక్టర్‌ల సస్పెన్షన్ జిల్లాలోని ఆర్టీసీ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా బస్సు ఎక్కిన మహిళలకు జీరో ఫెయిర్ టిక్కెట్లను అందజేయాల్సి ఉంటుంది. మహిళా ప్రయాణికులు తమ ఆధార్ ఏదైనా గుర్తింపు కార్డులు కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డులు చూసి జీరో టిక్కెట్లు అందజేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఈ పథకం మాటున అక్రమాలు జరుగుతున్నట్లు ఇటీవల టీటీఐల తనిఖీల్లో తేలిసింది. సాధారణంగా బస్సుల్లో ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ)లు టిక్కెట్లను తనిఖీలు చేస్తుంటారు. ఇదే క్రమంలో ఇటీవల టీటీఐలు జరిపిన తనిఖీల్లో మగవాళ్లకు కూడా స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు ఇవ్వడం గుర్తించారు. వెంటనే కేసు నమోదు చేసిన టీటీఐలు సదరు డిపో మేనేజర్‌లకు తెలియజేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన డిపో మేనేజర్లు క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ వేటు వేశారు. గుంటూరు-1 డిపోలో ఒకరు, గుంటూరు-2 డిపోలో ఇద్దరు, తెనాలి డిపోలో ఒకరు మొత్తం నలుగురు సస్పెండ్ అయినట్లు తెలిసింది. అయితే కండక్టర్‌లు కావాలని మగవాళ్లకు జీరో టిక్కెట్లు ఇచ్చి అనధికారికంగా నగదు తీసుకున్నారా? లేక పొరపాటుగా జీరో టిక్కెట్లు ఇచ్చారా అనే విషయాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలు తేలితే కఠిన చర్యలు తప్పవు

బస్సుల్లో ఇటీవల కొందరు కండక్టర్లు మగవాళ్లకు స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు అందజేసినట్లు తనిఖీల్లో తేలిందని జిల్లా ప్రజారవాణాధికారి విమల పేర్కొన్నారు. డిపో మేనేజర్ల స్థాయిలో క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, అక్రమాలు తేలితే ఉద్యోగం నుంచి కూడా తొలగింపు తప్పదన్నారు.

వారం రోజులు..32 రైళ్ల రద్దు

- వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్
- గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..
- డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ - పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు శనివారం నుంచి 18వ తేదీ వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ - డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్ సిటీ, విశాఖపట్నం - న్యూఢిల్లీ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్ - తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్ ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీ ల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్ - గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేంద్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జత చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్ మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

ఆయేషా తల్లిదండ్రులకు

దర్యాప్తు నివేదిక అందజేయండి!

- అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం

విజయవాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు నివేదికను ఆమె తల్లిదండ్రులకు అందజేయాలని.. సీబీఐ అధికారులను విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఆయేషా మీరా హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. దర్యాప్తు ముగిసిన అనంతరం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను తమకు అందజేయాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు చెప్పాలని, కోర్టుకు హాజరై వివరించాలని సీబీఐ కోర్టు వారికి నోటీసులు జారీచేసింది. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించిన ఆయేషా తల్లిదండ్రులు.. దర్యాప్తు నివేదికను తమకు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఆయేషా తల్లిదండ్రుల తరఫున న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరఫున గోపీనాథ్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. దర్యాప్తు నివేదికను అయేషా తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశారు.

దుర్గమ్మ ఆలయ..చీరల వేలం రూ.8.15కోట్లు

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టుచీరలు, సాధారణ , కాటన్ చీరలు, జాకెట్టు ముక్కలు, ఎర్ర రంగు చీరలు, రవికముక్కలు,



దుర్గగుడి ప్రాంగణంలో చీరల వేలం కౌంటర్

కాంట్రాక్ట్ దక్కించుకున్న గుంటూరు మహిళ

వివిధ రకాల వస్త్రాలను విక్రయించకొను లైసెన్స్ హక్కుకు శుక్రవారం మహా మండపం 6వ అతస్తులో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రథమ ధరావత్తు రూ.50,00,000లు చొప్పున డీడీ చెల్లించి బహిరంగ వేలం పాటలో ముగ్గురు పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మెస్సర్స్ శ్రీపావని కలెక్షన్స్ యజమాని నల్లూరి పావని మొదటి సంవత్సరానికి రూ.8,15,00,000లతో పాటు అదనంగా 5శాతం జీఎస్టీ చెల్లించేందుకు, రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరపు లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారు. ఇ-టెండర్ సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదు. ఈ నెల ఒకటిన టెండర్ కం వేలం పాటకు ప్రకటన ఇచ్చారు. గత ఏడాది రూ.6,04,24,445లు కంటే ప్రస్తుతం సుమారు 35 శాతం అధికంగా శుక్రవారం బహిరంగ వేలం పాటలో వచ్చిన హెచ్చు రేటుకు ఖరారు చేస్తూ దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు.

2016 నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం

2016 నుంచి ఇప్పటి వరకు దుర్గగుడిలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయగా ఆయా సంవత్సరాలలో వచ్చిన ఆదాయాల వివరాలు ఇలా ఉన్నాయి. 2016-17లో అప్పటి ఈవో ఐఏఎస్ అధికారిణి సూర్యకుమారి ఆధ్వర్యంలో రూ. 1.74కోట్లు, మరుసటి సంవత్సరం రూ.2. 80 కోట్లు వచ్చింది. 2018-19లో ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ ఈవోగా ఉన్న సమయంలో రూ.8.10 కోట్లు వచ్చింది. 2019-20లో సురేష్ బాబు ఈవోగా నిర్వహించిన చీరల వేలంలో రూ.5.11 కోట్లు వచ్చింది. తర్వాత సంవత్సరం కొవిడ్ సమయంలో రూ.3.30కోట్లు వచ్చింది. ఆ తరువాత దర్శముళ్ల భ్రమరాంబ ఈవోగా వేలంలో వరుసగా రూ.3.10 కోట్లు, రూ.5కోట్లు వచ్చింది. 2023-24లో రామారావు ఈవోగా వేలంలో రూ.5కోట్లు వచ్చింది. ఈ ఏడాది ఈవో వీకే శీనానాయక్ ఆధ్వర్యంలో వేలంలో రూ.8.15కోట్లు ఆదాయం వచ్చింది.

మానవత్వం చాటుకున్న మంత్రి సవిత



రోడ్డుపై పడిపోయిన వృద్ధుడి పరిస్థితి తెలుసుకుంటున్న మంత్రి

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న వృద్ధుడికి సపర్యలు చేసి.. తన కాన్వాయ్‌లోని వాహనంలో ఎక్కించి సమీప ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటన చూసిన వాహనదారులు, పాదాచారులు మంత్రి సవిత మానత్వాన్ని అభినందించారు. విజయవాడ నుంచి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మంత్రి సవిత వస్తున్నారు. క్యాంప్ కార్యాలయ సమీపంలో హైవేపై శుక్రవారం రాత్రి వడ్డేశ్వరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. ఇది గమనించిన మంత్రి 108 వాహనం వచ్చేవరకు ఆగకుండా తక్షణమే స్పందించి ఎస్కార్ట్ వాహనం ద్వారా సమీపంలోని ఎయిమ్స్‌కు అతనిని తరలించారు. దీంతో హైవేపై ట్రాఫిక్ కొద్ది సేపు స్తంభించింది. ఎటువంటి అధికార దర్పం చూపకుండా మంత్రి సవిత గతంలోనూ ఇదే రహదారిపై క్షతగాత్రులకు సాయం అందించారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

(5వ పేజీ తరువాయి)

ఆలోగా మొత్తం ప్రక్రియను ఓ కొలిక్కి తేవడానికి డ్వామా విభాగం కసరత్తు చేస్తోంది.

నేరుగా యాప్‌లో నమోదు

నరేగా యాప్‌లోనే ఈ కేవైసీ ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దీని ప్రకారం ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉంటున్న ప్రతి శ్రామికుడి వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీ అంకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇకపై పని ప్రదేశంలో శ్రామికుల హాజరు పక్కాగా ఉండడంతో పాటు బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడనుంది. ఇక మీదట పనివేళల్లో రోజుకు రెండు సార్లు ఫేస్ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. ఒకరికి బదులుగా వేరొకరు హాజరు వేసే ప్రయత్నం చేస్తే ఈ కేవైసీ అమలవుతుండడం వల్ల వెంటనే బయటపడనుంది. దీంతో వారికి ఇచ్చే వేతనాన్ని కూడా నిలుపుదల చేయనున్నారు

పాత విధానంలో అనేక అక్రమాలు

ఉపాధి హామీ శ్రామికుల హాజరు విధానంలో ఉన్న లొసుగులు లోపభూయిష్టంగా ఉండడంతో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏళ్ల తరబడి ఈ మస్టర్ల మాయాజాలం నడుస్తూనే ఉంది. యాప్‌లో గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేయడం వరకే పరిమితమయ్యేది. సంతకాన్ని కూడా ప్రామాణికంగా తీసుకునే వారు. దీంతో మస్టర్ల విషయంలో అనేక ఆరోపణలు వెలుగుచూసేవి. ఉదయం హాజరు వేయించుకుని పని ప్రదేశం నుంచి వెళ్లిపోవడం మొదలుకుని, అర్హత లేని వారికి కూడా రాజకీయ సిఫారసులతో జాబ్ కార్డులు ఇప్పించుకుని ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించేవారు. నవంబరు నుంచి అమలవబోతున్న నూతన విధానంలో రోజుకు రెండు సార్లు ముఖ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో మస్టర్ల విషయంలో ఇకపై ఎలాంటి అక్రమాలకు తావుండదని, అర్హతే ప్రామాణికంగా జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పనిచేసిన వారికే వేతనం పక్కాగా అమలు కానుందని అధికారులు చెబుతున్నారు

స్మార్ట్‌కార్డుల పంపిణీకి శ్రీకారం

నేడు ఒంగోలులో ప్రారంభించనున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్

ఏర్పాట్లు పూర్తి చేసిన పౌరసరఫరాల శాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ రేషన్ కార్డు చౌకధరల సరుకులతోపాటు అన్ని ప్రభుత్వ పథకాలకు కీలకమైంది. కొంతమంది లబ్ధిదారుల వేలిముద్రలు పడకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెల్లరేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను జారీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయగా ప్రకాశం జిల్లాలో శనివారం నుంచి పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 6.61లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా ప్రస్తుతం చెన్నై నుంచి జిల్లాకు 6.51 లక్షల స్మార్ట్ కార్డులు వచ్చాయి. ఆయా కార్డులను మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాలకు చేర్చారు. ఈ స్మార్ట్‌కార్డు క్యూఆర్ కోడ్ లేదా స్వైపింగ్ ద్వారానైనా రేషన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వయోపరిమితి ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, వేలిముద్రలు పడని వారందరూ క్యూఆర్ కోడ్ లేదా స్వైపింగ్ ద్వారా రేషన్ తీసుకున్నారు. జిల్లాలో ఈ స్మార్ట్‌కార్డుల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో శనివారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శాసనసభ్యుల సమక్షంలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

కాటేరు వాగు, జోమ్ కాలువ ఆక్రమణలను తొలగిస్తాం

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దర్శిలోని కాటేరువాగు, జోమ్‌కాలువ ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో గురువారం కబ్జా కాటు శీర్షికన ప్రచురితమైన కథనంకు వారు స్పందించారు. కాటేరువాగు, జోమ్ కాలువలు ఎంత మేరకు విస్తరించి ఉన్నాయో కొలతలు వేయించి హద్దులు వేయిస్తామన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి

రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి

మండల రైతు సంఘం మహాసభల్లో కృష్ణయ్య



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

మార్టూరు, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వైఖరిని వ్యతిరేకించాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పోరాటం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారమిక్కడ మండల రైతుసంఘం 3 మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో బహిరంగసభ నిర్వహించారు. సభకు మండల శాఖ అధ్యక్షుడు పాలెపు సాంబయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు భూములను దారాదత్తం చేస్తున్నారని, తద్వారా వ్యవసాయ రంగాన్ని నీరుగారుస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తూ వాటిని కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటున్నారు. సభలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, నాగబోయిన సాంబయ్య, గాడిపర్తి నాగేశ్వరరావు, వెల్లలచెరువు సుబ్బారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మండల రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడిగా పాలెపు సాంబయ్య, అధ్యక్షుడిగా పేర్ని నాగేశ్వరరావు, కార్యదర్శిగా వీరవల్లి కృష్ణమూర్తి, సభ్యులుగా గోనుగుంట్ల మోహనరావు, దూళ్లిపాళ్ల శ్రీనివాసరావు తదితరులను సభ్యులుగా ఎంపిక చేశారు.

షార్ట్ సర్క్యూటే కారణమా?

కలికివాయి వద్ద పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

బూడిదైన పొగాకు బేళ్లు.. రూ.557 కోట్ల నష్టం

మూడుగంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ అధికారులు

ఆ రెండు బ్లాక్‌లలో సిబ్బంది లేకపోవడంతో తప్పిన పెను ప్రభావం

వివిధ కోణాల్లో విచారిస్తున్న పోలీసులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



గోదాం నుంచి ఎగిసి పడుతున్న అగ్నిజ్వాలలు

సింగరాయకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో ఉన్న టీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా (జీపీఐ) లిమిటెడ్ కంపెనీ అద్దె ప్రతిపాదికన తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ కంపెనీలో ఏ, బీ బ్లాక్‌లలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి క్షణాల్లోనే ఒక కోటి పది లక్షల (11 మిలియన్) కేజీల పొగాకు బూడిదైంది. సుమారు రూ.557 కోట్ల నష్టం వాటిల్లినట్లు జీపీఐ కంపెనీ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం చోటుచేసుకుని ఉంటుందని కంపెనీ జీఎం అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ ప్రమాదం కావడం, నష్టం కూడా పెద్దమొత్తంలో ఉండటంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు.

ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి..

ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ సిబ్బంది తొలుత టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి ఒక ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే భారీగా ఎగసిపడుతున్న మంటలను చూసి కొండపి, ఒంగోలు, కందుకూరు, కావలి నుంచి మరో నాలుగు ఫైర్ ఇంజన్లను తెప్పించారు. ఏ, బీ బ్లాకుల నుంచి అగ్ని కీలలు మిగతా బ్లాకులకు విస్తరించకుండా దాదాపు 3గంటలు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సాయంత్రం వరకు ఐదు ఫైర్ ఇంజన్‌లను అక్కడే ఉంచారు. అప్పుడప్పుడూ అక్కడక్కడా వస్తున్న మంటలను అదుపు చేశారు. డీఎఫ్‌వో శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షించారు. భారీ అగ్నిజ్వాలల ధాటికి ప్రమాదం జరిగిన రెండు గోదాంల పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిచోట్ల గోడలు కుప్పకూలాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రమాదానికి గల కారణాలను వెల్లడిస్తామన్నారు.

ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, వీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బత్తుల మహేంద్ర ఉన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రమాదం చోటుచేసుకున్న టీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని పరిశీలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

350 మంది సిబ్బంది సురక్షితం

కంపెనీలో రోజువారీ 900మంది సిబ్బంది పనిచేస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయంలో రాత్రి షిఫ్టులో దాదాపు 350 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గోదాంల నుంచి ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడటంతో వారంతా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన గోదాంల వెనుకవైపు పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు హుటాహుటినా బయటకు పంపించారు. ఏ, బీ బ్లాక్‌లలో కేవలం ఎగుమతికి సిద్ధంగా ఉన్న పొగాకు మాత్రమే ఉండటం, అందులో కార్మికులెవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మారనున్న దొనకొండ దశ

ప్రజా ప్రభుత్వంలో చిగురిస్తున్న ఆశలు

రక్షణ రంగానికి చెందిన భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు

రెండు నెలల క్రితం భూములను పరిశీలించిన డీఆర్‌డీవో సంస్థ ప్రతినిధులు



భూములను పరిశీలిస్తున్న డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ బృందం, పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం మదన్‌మోహన్, తహసీల్దార్ రమాదేవి(ఫైల్)

దొనకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అనుగుణంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. అనంతపురం జిల్లాలోని మడకసిర, ప్రకాశం జిల్లాలోని దొనకొండ, కృష్ణ జిల్లాలోని జగ్గయ్యపేట ప్రాంతాల్లో డిఫెన్స్ పరిశ్రమల అభివృద్ధి జరిగేలా చర్యలు చేపట్టింది. అందులోభాగంగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) సంస్థ ఒక అడుగు ముందుకేసి దొనకొండలో రెండు దశలుగా రూ.1200 కోట్ల పెట్టుబడులతో ఆయుధ క్షిపణుల తయారు పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అందుకు 1400 ఎకరాల భూమి అవసరంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులన్నీ సకాలంలో వస్తే ఏడాదిలో పరిశ్రమ ప్రారంభ ఏర్పాట్లు చేపట్టి, రెండేళ్లకు పూర్తి చేసేలా ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది.

దొనకొండలో ఈ పరిశ్రమ ఏర్పాటు జరిగితే ఇటు రాష్ట్ర రాజధాని అమరావతి, అటు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి చేరువగా ఉంటుందనేది సమాచారం. ఇక్కడ తయారుచేసే వస్తువులు రాబోయే రోజుల్లో విదేశాలకు ఎగుమతులు చేసే అవసరంగా ఉండవచ్చని అత్యధిక ఉత్పాదక కేంద్రంగా నెలకొల్పేందుకు బీడీఎల్ సంస్థ ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. అందులోభాగంగా రెండు నెలల క్రితం డీఆర్‌డీవో సంస్థకు చెందిన ప్రతినిధులు దొనకొండకు విచ్చేసి ఈ ప్రాంతంలోని భూములను, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కనిగిరి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు.

ఆపరేషన్ సిందూర్ అనంతరం బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తిని పెద్దఎత్తున పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుందని విశ్వసనీయ సమాచారం. అందునిమిత్తం దొనకొండలో రక్షణశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక రక్షణరంగ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ఇటీవల ప్రభుత్వానికి బీడీఎల్ సంస్థ డీపీఆర్‌ను అందించినట్లు ప్రచారం. దొనకొండలో బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం, గుంటూరు-బెంగుళూరు ప్రధాన రైలుమార్గం ఉండటం భారీ పరిశ్రమల ఏర్పాటుకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దొనకొండ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ప్రకటించటం జరిగింది. అందుకు అధికారులు కార్యాచరణ చేపట్టి వడివడిగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం దొనకొండ ప్రాంతంలో అధికంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల కారిడార్ ఏర్పాటుకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులోభాగంగా మండలంలోని భూములను రెవెన్యూ అధికారులచే సమగ్ర సర్వే చేయించి పట్టాభూమి 4407-62 ఎకరాలు, ప్రభుత్వ భూమి 12367-95 ఎకరాలు, అసైన్‌మెంట్ భూమి 8287-28 ఎకరాలు, మొత్తం 25061-85 ఎకరాల భూమిని నిర్ధారించారు. 2014 నుండి 2019 మధ్య కాలంలో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ ప్రాంతాలకు చెందిన ఎందరో ప్రతినిధులు ఈ భూములను పరిశీలించారు. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పరిశ్రమల ఏర్పాటుపై ఎటువంటి దృష్టి సారించకపోవటంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. ఏడాదిన్నర కాలంలో పరిశ్రమల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవతో దొనకొండ ప్రాంతం అభివృద్ధిలో బాగంగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దొనకొండ దశ మారనుందని ప్రజలు భావిస్తున్నారు.

దొనకొండ సమీపంలో బీడీఎల్‌కు 1400 ఎకరాలు

భూకేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం

రూ.1200 కోట్లతో యూనిట్ ఏర్పాటు

ఒంగోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ప్లాంట్ ఏర్పాటుకు జిల్లాలోని దొనకొండ సమీపంలో ప్రభుత్వం భూకేటాయింపు చేసింది. ఇందుకోసం 1,400 ఎకరాలను కేటాయింపు చేస్తూ శుక్రవారం జరిగిన రాష్ట్రమంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దొనకొండ పరిసరాల్లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించగా పలు కంపెనీలు తమ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన బీడీఎల్ రక్షణ రంగంలో ఆయుధ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. సుమారు రూ.1200 కోట్లతో నూతన ఆయుధ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించేందుకు 1,400 ఎకరాల భూమి అవసరంగా బీడీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రెండు దశల్లో ఈ ప్లాంట్ నిర్మించాలని భావిస్తుండగా దీని ద్వారా 1400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. కాగా బీడీఎల్ కోరిక మేరకు భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో ప్లాంట్ ఏర్పాటుకు 1200 ఎకరాలు, టౌన్‌షిప్ నిర్మాణానికి 146.67 ఎకరాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చేతిలో ఉన్న భూమిని ఎకరా రూ.7.73 లక్షల వంతున కేటాయించనుండగా మిగిలిన భూమికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కేటాయించాలని నిర్ణయించారు.

రెండో హత్య కేసులో మళ్లీ యావజ్జీవం

అవీఇవీ

వాచ్‌మన్‌ను హత్య చేసిన 78 ఏళ్ల వయస్సు ఉన్న నిందితుడు

రెండోసారి కూడా అదే శిక్ష

కొండపి/ఒంగోలు క్రైం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని మద్దులూరు రోడ్డులో 2023 సంవత్సరంలో ఓ బ్రాందీ షాపు ముందు నిద్రిస్తున్న వాచ్‌మన్‌తో గొడవపడి గడ్డపారతో హత్య చేసిన కేసులో నిందితుడికి శుక్రవారం యావజ్జీవ శిక్ష పడింది. ఆ మేరకు శుక్రవారం జిల్లా కోర్టులో కొండపికి చెందిన కడియం హనుమంతరావుకు జీవిత ఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తు ఒంగోలు అదనపు జిల్లా న్యాయాధికారి టి.రాజావెంకటాద్రి తీర్పు నిచ్చారు. అప్పట్లో కొండపిలో సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితునికి తాజాగా పడిన యావజ్జీవ శిక్ష రెండోసారని తెలిసింది. టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన కడియం హనుమంతరావుకు దాదాపు 30ఏళ్ల క్రితం గ్రామంలో జరిగిన హత్య కేసులో యావజ్జీవ శిక్ష పడింది. ఆ కేసులో ముద్దాయి శిక్ష అనుభవించాడు. అనంతరం తన స్వగ్రామం పొందూరు విడిచి కొండపికి వచ్చి గుడులు, పాడుబడిన, ఖాళీగా ఉండే ఇళ్లలో ఉంటున్నాడు. 2023 సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీ రాత్రి పది గంటల సమయంలో బ్రాందీ షాపులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మండలంలోని పోలిరెడ్డిపాలేనికి చెందిన సంగన సుబ్బారెడ్డితో దుకాణం మూసేటప్పుడు గొడవపడ్డాడు. ఆవేశంతో చంపుతానని బెదిరించి, అర్ధరాత్రి తన నివాసం నుంచి గడ్డపారతో వెళ్లి సుబ్బారెడ్డి తలపై కొట్టి చంపాడు. ఈమేరకు మృతుని భార్య సంగ సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పట్లో ఈ హత్య కొండపిలో సంచలనంగా మారింది. సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు, పోలీసు జాగిలాలు కూడా నేరుగా నిందితుడి ఇంటికి వెళ్లాయి. ఈ కేసులో తిరిగి నిందితుడికి యావజ్జీవ శిక్ష పడింది. ఒకే వ్యక్తికి రెండుసార్లు హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష పడటం అరుదు. మొదటిసారి శిక్ష పడ్డాక సహజంగా పశ్చాత్తాపం ఉంటుంది. అటువంటిది తిరిగి రెండోసారి హత్య చేయడం విచిత్రంగా ఉందని అప్పట్లో స్థానికుల్లో చర్చనీయాంశమైంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి వాదనలు వినిపించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టిన పోలీసులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందిచారు.

కాలువల రీడింగ్స్ సరిచేసేందుకు గేజింగ్ డివిజన్‌కు నివేదించాం

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల్లో నీటి కొలతల్లో తేడాలను సరిచేసేందుకు గేజింగ్ డివిజన్‌కు తెలిపినట్లు ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ కాలువల్లో నీటి కొలతల్లో మతలబు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు వద్ద (ప్రకాశం బార్డర్), దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద రీడింగ్‌లో తేడాతో కిందకు తక్కువ నీరు వస్తున్నా ఎక్కువ నీరు విడుదల అవుతున్నట్లు రీడింగ్‌లు చూపుతున్నాయి. దీనివల్ల చివరి భూములకు సక్రమంగా నీరందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా అధికారులు స్పందించి రీడింగ్ గేజ్‌లను తనిఖీలు చేసి సరిచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

గ్రామీణ బ్యాంకుల విలీనం

ఇకపై 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు'గా మార్పు

సోమవారం వరకు నిలిచిపోనున్న సేవలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు గ్రామీణ బ్యాంకులను విలీనమవుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిపి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్'గా ఏర్పాటుచేస్తున్నారు. ఇకపై ఈ నాలుగు బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలను ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చే ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు శుక్రవారం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఈ బ్యాంకుల ద్వారా నిర్వహించే సేవలను నిలిచిపోనున్నాయి. దాంతోపాటుగా ఈ బ్యాంకుల పరిధిలో కొనసాగే ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్ వంటి ఆన్‌లైన సేవలు కూడా పనిచేయవని బ్యాంకర్లు వెల్లడిస్తున్నారు. కాగా అక్టోబరు 11 రెండవ శనివారం, 12 ఆదివారం బ్యాంకులకు సెలవులు అయినప్పటికీ సాధారణంగా సెలవు రోజుల్లో పనిచేసే ఆన్‌లైన్ సేవలు కూడా నిలిచిపోయాయి.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఫ్యాక్టరీల యజమానులు


చీమకుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 2,500 గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు పదిరోజుల నుంచి సమ్మె చేస్తున్నా పట్టించుకొనేవారే కరవయ్యారని, ఫ్యాక్టరీలు మూతపడటంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వినతిపత్రంలో తెలిపారు. రాయల్టీ వసూలు గతంలో వలే ప్రభుత్వమే వసూలు చేయాలని, ఏఎంఆర్ సంస్థకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని కోరారు. పెంచిన రాయల్టీని తగ్గించి పరిశ్రమను కాపాడాలని కోరారు. వెంటనే ఫ్యాక్టరీ ఓనర్లతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం అయ్యేలా చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మాకినేని అమరసింహం, పుత్తూరి శ్రీనివాసరావు, జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఫ్యాక్టరీ ఓనర్ల అత్యవసర సమావేశం

పదిరోజుల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసివేసి సమ్మె చేస్తున్న ఓనర్లు శనివారం వీటీసీలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కొనసాగిస్తున్న సమ్మెపై సమీక్ష, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తోనూ, ఏఎంఆర్ సంస్థతోనూ రెండువిడతలపాటు అసోసియేషన్ నాయకులు జరిపిన చర్చల సారాంశాన్ని ఓనర్ల అందరికీ వివరించి తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు. సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రభుత్వంతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోలేదు. ఈనెల 3న అని మొదట అనుకున్నా ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మె నేపథ్యంలో వ్యూహాత్మకంగా ఒప్పందం కుదుర్చుకోవటంలో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. తాజాగా 24వ తేదీ వరకూ గడువు కోరటం, ప్రభుత్వం మంజూరు చేయటం జరిగింది. దీంతో ఫ్యాక్టరీ ఓనర్లు పునరాలోచనలో పడ్డారు. సమ్మెకు తాత్కాలికంగా విరామం ఇచ్చి ఏఎంఆర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకొన్న తర్వాత వారి పోకడలు చూసి తిరిగి సమ్మె చేద్దామా లేదా ప్రస్తుతం నిర్వహిస్తున్న సమ్మెను కొనసాగిద్దామా అనే విషయాన్ని నేడు జరగనున్న ఓనర్ల సమావేశంలో నిర్ణయించనున్నారు.

స్వచ్ఛందంగా స్పందించారు

● రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు



సమీక్షిస్తున్న ఐజీ త్రిపాఠి

పర్చూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - యద్దనపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో ఈ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. చిల్లచెట్ల మధ్య ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన కొల్లా చంద్రం, పర్చూరు గ్రామానికి చెందిన ఒగ్గిశెట్టి నరసింహం నేతృత్వంలో స్వచ్ఛంద సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి చిల్లచెట్లను తొలగించారు. ప్రజా సమస్యలపై స్వచ్ఛందంగా స్పందించి సేవానిరతిని చాటుకున్న వారిని వాహనదారులు, ప్రజలు కొనియాడుతున్నారు.

అవీ..ఇవీ..

అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు



ఇందిరా కాలనీలో రూపుదిద్దుకున్న అంతర్గత సీసీ రోడ్డు

పర్చూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో తొలివిడతగా రూ.6.25 కోట్లతో 67 పనులు మంజూరయ్యాయి. అలాగే రెండో విడతలో రూ.11.75 కోట్ల వ్యయంతో 94 పనులు మంజూరయ్యాయి. గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో మొత్తం రూ.80 లక్షల వ్యయంతో 10 పనులకు నిధులు మంజూరయ్యాయి. వీరన్నపాలెం రూ.1.13 కోట్లు, పోతుకట్ల గ్రామంలో రూ.70లక్షలు, చెరుకూరులో రూ.1.50 కోట్లు, భూషాయపాలెం రూ.30లక్షలు, గొల్లపూడి రూ.30లక్షలు, చిన్ననందిపాడు రూ.30 లక్షలు, అన్నంబొట్లవారిపాలెం రూ.60లక్షలు, గర్నెపూడి రూ.25లక్షలు, తిమ్మరాజుపాలెం రూ.75లక్షలు, నూతలపాడు రూ.1.25 కోట్లు, కొల్లవారిపాలెం రూ.25లక్షలు, నాగులపాలెం రూ.1.50 కోట్లు, దేవరపల్లి రూ.కోటి, పర్చూరు రూ.2.50 కోట్లు, బోడవాడ రూ.40 లక్షలు, అడుసుమల్లి రూ.1.90 కోట్లు, ఇనగల్లు రూ.55లక్షలు, కొమర్నేనివారిపాలెం రూ.20లక్షలు, తన్నీరువారిపాలెం రూ.20లక్షలు, రమణాయపాలెం రూ.15లక్షలు, ఏదుబాడు రూ.30లక్షలు, పెద్దివారిపాలెం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

వెయిట్ లిఫ్టింగ్‌లో కారంచేడు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని భారత వ్యాయామ కళాశాలలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి పోటీల్లో కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారు. 55 కిలోల విభాగంలో కె.దుర్గా, 60 కిలోల విభాగంలో భవ్యశ్రీ, బాలుర విభాగంలో బి.సుధీర్ కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో డిప్యూటీ డీఈవో గంగాధర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలుప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొత్తపేట, ప్రసాదనగర్, చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మరమ్మతుల అనంతరం సరఫరా యథావిధిగా కొనసాగుతోందన్నారు.

చినగంజాం : మండలంలోని చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్ ఏఈ ఎల్.బ్రహ్మం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మున్నం వారిపాలెం, సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోటరీలో నేడు బీజేపీ కార్యశాల

చీరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతం, పార్టీ కార్యక్రమాలకు సంబంధించి నేడు రోటరీ క్లబ్ కమ్యూనిటీ భవనంలో జిల్లా కార్యశాల నిర్వహించనున్నట్లు ప్రతినిధులు ఒక ప్రకటలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అద్దంకిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం పొందవచ్చని అద్దంకి ఏడీఏ బి. ఎఫ్రాయిమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో గో-ఆధారిత వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. రైతులకు అందుబాటులో అన్ని రకాల కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం రైతులకు అందుబాటులో ఉంచి, తక్కువ ధరకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు స్వంతగా కూరగాయలు పండించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా కషాయాలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఆదర్శ రైతు నరిశెట్టి రమేష్, షాపు యజమాని నరేంద్ర, అశోక్, కోకిల, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులపై అవగాహన



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు గ్రామంలో శుక్రవారం ఒంగోలు ఆత్మవారి సహకారంతో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో అవసరమైన వివిధ కషాయాల తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు వివిధ కషాయాలను తయారు చేసుకుని నిల్వ చేసుకోవడం ద్వారా అవసరమైన సమయంలో చీడపీడల నివారణకు పంటలపై పిచికారీ చేసుకోవచ్చన్నారు. బీజామృతం, ద్రవజీవామృతం, దశపర్ణికషాయం, అగ్నిస్త్రం కషాయాల తయారీ పద్ధతులను రైతులకు చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సీ.హెచ్.హరి, ఆత్మ ఏటీఎం అక్షరరాణి, సీఆర్‌పీలు రమేష్, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో మానసిక ఆరోగ్యం బాగు

- మానసిక వైద్యనిపుణురాలు నాగలక్ష్మి
- వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

బల్లికురవ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో ఉంటే మానసిక ఆరోగ్యం బాగుటుందని, అందరు ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జి.నాగలక్ష్మీ అన్నారు. మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. చెడు ఆలోచనల గురించి మరిచి పోవాలన్నారు. ఒంటరిగా ఉన్న సమయంలో ధ్యానం చేయాలన్నారు. చదువులో ఇది ఎంతో ఉపయెగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టిసారించాలి

మేదరమెట్ల, : విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని చీరాల డివిజన్ డిప్యూటీ ఈవో డి.గంగాధరరావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మేదరమేట్ల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర రావు మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఆ రోగ్య ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు తెలియజేయా లన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ వేణుగోపాలరావు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలిశమ్మ, హెచ్‌ఎం అంజనీదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్కటి స్నేహ సంబంధాలతో సమస్యలు దూరం

అద్దంకిటౌన్ : కుటుంబంలో, స్నేహితుల మధ్య మంచి సంబంధాలు ఉండాలని ప్రజావైద్యశాల వైద్యులు డాక్టర్ యలగాల హనుమంతరావు అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రస్తుతం సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు-నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ పిల్లల్ని సత్ప్రవర్తనతో పెంచాలన్నారు. ఒత్తిడి తగ్గించుకోవాలని, మంచి ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటే మానసిక సమస్యలకు దూరం గా ఉంటామన్నారు. కార్యక్రమం లో రోటరీ అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, అలహరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, దేవపాలన, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, లేవి ప్రసాద్ శ్రీలక్ష్మి, శివకుమారి, భువనేశ్వరి, ఖాజావలి తదితరులు ఉన్నారు.



వైదనలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు





మేదరమెట్లలో మాట్లాడుతున్న గంగాధరరావు, అద్దంకిలో మాట్లాడుతున్న హనుమంతరావు

భూముల రీసర్వే లోపాలను సరిదిద్దరే..?

రెవెన్యూ సిబ్బందిపై ధ్వజమెత్తిన సర్పంచులు

మార్టూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రీసర్వే చేయడం ద్వారా నమోదైన లోపాలను ఇంతవరకు రెవెన్యూ అధికారులు సరిచేయలేక పోయారంటూ పలు గ్రామాల సర్పంచులు రెవెన్యూ అధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో కోలలపూడి సర్పంచ్ ఎం సతీష్ కుమార్, బొల్లాపల్లి సర్పంచ్ నార్నె సింగారావు, చిమ్మిరిబండ సర్పంచ్ జంపని వీరయ్యలు రీసర్వేలో జరిగిన పొరబాట్లను సరిచేయలేదని, రైతులకు ఇంతవరకు పాస్‌బుక్‌లను ఇవ్వలేదని సమావేశానికి హాజరైన ఆర్ఐ అశోక్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి సమాధానం చెబుతూ ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువెళతానన్నారు. అదేవిధంగా పలుగ్రామాలలో విద్యుత్ స్తంభాలు శిథిలదశలో ఉన్నాయని, కరెంటు తీగలు కిందకు వేలాడుతున్నాయని, వాటి గురించి విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 25 లోపు రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని, అధికంగా యూరియాను వినియోగించకుండా రైతులకు అవగాహన కలిగించాలని ప్రజా ప్రతినిధులను ఏవో లావణ్య కోరారు. తమ గ్రామంలో బోర్లు మరమ్మతులు చేయడంలేదని బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ప్రభుత్వం సహకారంతో ఇళ్లు నిర్మించుకునేందుకు మండలంలో 827 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో రెండు నెలల్లో కొత్తగా ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని హసింగ్ ఏఈ రాహుల్ తెలిపారు. అదేవిదంగా మండలంలో ద్రోణాదుల, వలపర్ల హైస్కూల్స్‌లో స్కూల్‌కు అనుసంధానంగా ఇంటర్ ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో విద్యార్థుల ప్రవేశాలు జరగలేదని ఎంఈవో వస్రాంనాయక్ తెలిపారు. గ్రామాలలో గాలి కుంటువ్యాధులకు పశువులకు టీకాలు వేస్తున్నట్లు మార్టూరు ఏడీఏ తెలిపారు. గ్రామాలలో రెండవ విడత ఎన్ఆర్ఈజీఎస్ కింద రెండవ విడత నిధులు మంజూరయ్యాయని, వాటితో సిమెంటురోడ్లు, సైడు కాల్వలు నిర్మాణం చేపడతామని పీఆర్ ఏఈ శాస్త్రి తెలిపారు. మండలంలో చెరువులు అన్నీ నిండాయని, నీటి కొరత లేదని, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. మహాపోషణ కార్యక్రమం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఉద్యానాధికారి బి హనుమంతనాయక్, ఏపీఎం లక్ష్మీనారాయణ,మార్టూరు ఈవో తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో వస్త్రంనాయక్

విద్యార్థులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై అవగాహన

బల్లికురవ, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్‌బాబు మాట్లాడుతు విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికాకుండా ప్రభుత్వం పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థులు కూడా ఎంతో జాగ్రత్తగా చెడు స్నేహాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఎవరైన ఎక్కడైన ర్యాగింగ్ వంటి కార్యకలపాలకు గురిచేస్తే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి, ఇన్‌చార్జ్ హెచ్ఎం డేవిడ్‌పాల్, మహిళ పోలీసు హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాజకుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

చినగంజాం : బాలికలను తప్పనిసరిగా చదవించాలని ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో జి.సులోచనారాణి, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.సువర్ణాంజలిలు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీడీపీవో అన్నారు. ఆయా పాఠశాలలోని బాలికలకు బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవణా, వ్యక్తిగత పరిశుభ్రత, సైబర్ నేరాలు, లింగ సమానత్వం, పోషకాహారం తదితర విషయాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు అవగాహన కల్పించారు. బాలికా దిపోత్సవం సందర్భంగా బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. ఆర్.శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.వాణిశ్రీ, ఎన్.సమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాలకృష్ణ కుంటలో అక్రమంగా మట్టి తవ్వకం

అధికారులు చూస్తుండగానే పట్టపగలు యథేచ్ఛగా తరలింపు

మార్టూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): అధికారులు అందరూ చూస్తుండగానే, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాల మీదగా చెరువు మట్టిని అక్రమంగా తరలించిన వైనం ఇది. మండల కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు వెనుక ప్రాంతంలో బాలకృష్ణ కుంట ఉంది. అక్కడ నుంచి శుక్రవారం మధ్యాహ్నం అక్రమంగా చెరువు మట్టినితవ్వి తీసి అమ్ముకుంటున్నారు. చెరువులో ఏర్పాటు చేసిన ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టిని ట్రాక్టర్లుకు లోడింగ్ చేసి గ్రామంలోకి తరలిస్తున్నారు. గ్రామంలోని పడమర బజారుకు చెందిన ఒకవ్యక్తి చెరువు నుంచి మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఖాళీగా ఉన్న స్థలాలకు మేరవగా చెరువు మట్టిని వినియోగిస్తుంటారు. గ్రావెల్‌కు డిమాండు పెరగడంతో, తక్కువ ఖర్చుతో చెరువు మట్టితో ఖాళీ స్థలాలను నింపుతున్నారు.అయితే వర్షాలు కురుస్తుండటంతో చెరువు నుండి మట్టిని తరలించడం ఇబ్బందిగా మారింది. అందువలన బాలకృష్ణ కుంటలో ఖాళీగా ఉన్న ప్రదేశంలోని మట్టిని తీసి సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ చెరువునుండి అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకున్న వ్యక్తులు ఉన్నారు. వారిని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో గాని ప్రస్తుతం కూడా అదే విధంగా ట్రాక్టర్ల యథేచ్ఛగా మట్టి విక్రయాలు సాగుతున్నాయి.



మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

నూతన జీఎస్టీ విధానంతో దేశ ప్రగతికి ఊతం

చినగంజాం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 తగ్గించిన నేపథ్యంలో వస్తువుల కొనుగోలు శక్తి పెరగడంతో దేశం కూడా ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని జీఎస్టీ నోడల్ అధికారి, చీరాల డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.ధనలక్ష్మి అధ్యక్షతన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాటాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరికరాలు, ఫిషింగ్ నట్స్, కిరాణా ప్రొవిజన్స్, కంప్యూటర్లు, టీవీలు తదితర వస్తువులను ప్రదర్శనగా పెట్టి, వాటిపై జీఎస్టీ తగ్గిన విధానాన్ని ఆయా శాఖల అధికారులు వ్యాపారులు, రైతులు, డ్వాక్రా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో చింతగుంపల్లె, సంతరావూరు పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మి, చినగంజాం, చింతగుంపల్లె, నీలాయపాలెం గ్రామ సర్పంచులు రాయని ఆత్మారావు, వైసత్యనారాయణ, తూమాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, ఎఫ్‌డీవో ఎం.రవీంద్ర, ఏవో ఆర్.చంద్రశేఖర్, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, టీడీపీ మండల నాయకులు, అంగాన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

అద్దంకిటౌన్ : వస్తువులపై జీఎస్టీ తగ్గింపు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వాణిజ్య పనులు శాఖ అధికారులు ఎం.వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఎస్‌జీఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తగ్గిన జీఎస్టీ తద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు భాగ్యరాజు, వి.దీప్తి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఉపకరణాల ధరల తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వక్తృత్వ పోటీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని మణిదీపికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పంగులూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మణిదీపిక ప్రతిభచాటి తృతీయ స్థానం సాధించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన బాపట్లలో 'సేవ్‌దిగర్ల్ అండ్ చైల్డ్' అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలో మణిదీపిక పాల్గొని ప్రతిభచాటారు. కలెక్టర్ చేతులమీదుగా బహుమతి అందుకున్న మణిదీపికను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ పంపిణీలో సమస్యలను పరిష్కరించాలి

- ప్రజాప్రతినిధులు, డీలర్లతో అధికారుల సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్, పక్కన చైర్మన్ సాంబశివరావు

చీరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీలో ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం వార్డు ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్మార్ట్‌కార్డుల పంపిణీ, కార్డుదారుల మ్యాపింగ్ వంటి వాటిపై చర్చించారు. సాంకేతిక పరమైన సమస్యల్లో జాప్యత లేకుండా సాధ్యమైనంత మేరకు సకాలంలో పంపిణీలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

- ఘనంగా అంతర్జాతీయ బాలికాదినోత్సవం



విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న హెచ్ఎం

ఈపూరుపాలెం(చీరాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోటీపరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ హనోరా, సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు గ్రామంలో శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. 11వ తేదీ ఉదయం 10గంటలకు కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు. 11 గంటలకు బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు, ఒంటిగంటకు సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నేడు అడవిపాలెంలో మంత్రి పర్యటన

సంతమాగులూరు : మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకటరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన జరిగిన సమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందుబాటులో లేకపోవడంతో వెంకట్రావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు. శుక్రవారం విదేశాల నుండి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అడివిపాలెం గ్రామంలోని గాడిపర్తి వెంకటరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు..

పంగులూరులో భారీ వర్షం

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పంగులూరు పరిసర గ్రామాలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఎడతెరపి లేకుండా ఉరుములతో కూడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో కొద్ది గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. భారీ ఉరుముల మోతలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సంతనూతలపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో వైద్య చికిత్సలు చేయించుకున్న 37మంది లబ్ధిదారులకు రూ.17.20లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.